తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 70 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 వెల రూ. 2 రూ/ బుధవారం 14 -10 - 2026



సింహాలతో సీతక్క సవారీ

- దక్షిణాఫ్రికాలో సఫారీ వీడియో వైరల్
- దక్షిణాఫ్రికా పర్యటనలో మంత్రి సీతక్క
- సింహాల సఫారీలో వాటి వెంటే ధైర్యంగా నడిచిన దృశ్యాలు
- ఆమె ధైర్యాన్ని కొనియాడుతున్న నెటిజన్లు
- ఆదివాసీ నేపథ్యమే దీనికి కారణమంటూ ప్రశంసల వెల్లువ

హైదరాబాద్ :

తెలంగాణ మంత్రి సీతక్క ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా - మిగతా 2 లో

రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నేతలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- బిల్లీలోని రేవంత్ రెడ్డి నివాసంలో నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు
- బిల్లీలో అందుబాటులో ఉన్న నేతలతో పీసీసీ అధ్యక్షుడితో కలిసి సమావేశమయ్యారు
- బిల్లీలోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో నేతలతో సమీక్ష సమావేశం



హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న కరవు, విద్యుత్ కొరత, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై నేతలతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. దిల్లీలోని రేవంత్ రెడ్డి నివాసంలో నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దిల్లీలో అందుబాటులో ఉన్న నేతలతో సీఎం, పీసీసీ అధ్యక్షుడు సమావేశమయ్యారు. గంటకుపైగా కొనసాగిన సమావేశంలో వివిధ అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం పాల్గొన్నారు.గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దని, రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు దిశానిర్దేశం చేశారు. ఎవరి పరిధిలో వాళ్లు గట్టిగా పని చేయాలని, పట్టభద్రుల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని సీఎం స్పష్టం చేశారు. ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ వరకు ప్రతి విషయంలోనూ ప్రత్యేక దృష్టి - మిగతా 2 లో

ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?



- కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి ఆగ్రహం
- ప్రజాస్వామ్య హక్కులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి - కిషన్ రెడ్డి
- ఢిల్లీలో కాంగ్రెస్ నిరసనలను అడ్డుకోవడం లేదన్న కేంద్ర మంత్రి
- తెలంగాణలో బీజేపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్ :

ప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా - మిగతా 2 లో

ఉగ్రవాదంపై భారత్ వెనక్కి తగ్గదు



- వారికి ఆశ్రయం లేకుండా చూడాలి
- BIMSTEC దేశాలకు అమిత్ షా పిలుపు
- ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు
- ఉగ్రవాదులకు ఎక్కడా ఆశ్రయం లేకుండా చూడాలని BIMSTEC దేశాలకు పిలుపునిచ్చారు

ఇంద్రకీలాద్రిపై తమిళనాడు సీఎం విజయ్

- కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు
- విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం విజయ్
- ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన విజయ్
- ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చకులు



అమరావతి :

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం విజయవాడలో పర్యటించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ఆయన, ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. - మిగతా 2 లో



సింగరేణి కార్మికులకు దసరా ధమాకా

- ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల వరకు బోనస్!
- సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్
- కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లింపు
- పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా
- అర్హులైన పర్మినెంట్ కార్మికులకు గరిష్ఠంగా రూ.1,53,913
- పండుగకు ముందే ఖాతాల్లో బోనస్ జమ చేయనున్న యాజమాన్యం

హైదరాబాద్ :

దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. మరోవైపు సంస్థ నికర లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు పంపిణీ చేయనున్నారు. దీంతో సింగరేణి కార్మికుల ఇళ్లలో పండుగ సందడి నెలకొంది.సింగరేణి సాధించిన - మిగతా 2 లో



స్టార్‌లింక్‌కు అనుమతులు ఆపండి

- కేంద్రానికి ఆరెస్సెస్ అనుబంధ సంస్థ విజ్ఞప్తి
- స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు అనుమతులు నిలిపివేయాలని కేంద్రానికి విజ్ఞప్తి
- ఎలాన్ మస్క్ వ్యాఖ్యలు బాధ్యతారహితమన్న స్వదేశీ జాగరణ్ మంచ్
- జాతీయ భద్రత దృష్ట్యా స్టార్‌లింక్‌ను నిరోధించే హక్కు భారత్‌కు ఉందని స్పష్టీకరణ
- విదేశీ కంపెనీకి బదులు దేశీయ సేవలను ప్రోత్సహించాలని సూచన

ఢిల్లీ :

ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్టార్‌లింక్' శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు భారత్‌లో - మిగతా 2 లో

సీట్ల సర్దుబాటుపై కసరత్తు

- పంపకాలపై కొనసాగుతున్న కూటమి నేతల చర్చలు
- కూటమిలో స్థానిక ఎన్నికల సీట్ల సర్దుబాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు
- ఈ క్రమంలో జనసేన అధినేత పవన్‌తో, ఆ పార్టీ నేతలతో టీడీపీ నేతలు చర్చలు జరిపారు



అమరావతి :

కూటమిలో స్థానిక ఎన్నికల సీట్ల సర్దుబాటు పంచాయితీ ఇంకా కొలిక్కి రాలేదు. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. జనసేన సీట్ల లెక్కలు తేల్చాక బీజేపీతో చర్చలకు వెళ్లాలని నిర్ణయించారు. జనసేన అధినేత పవన్‌తో, ఆ పార్టీ నేతలతో టీడీపీ నేతలు చర్చలు జరిపారు. ఆ చర్చల సారాంశాన్ని అనంతరం చంద్రబాబుకు వివరించారు.కూటమిలో స్థానిక ఎన్నికల సీట్ల సర్దుబాటు విషయమై చర్చోపచర్చలు సాగుతున్నాయి. కూటమి ఐక్యతను కాపాడుకుంటూ, గెలుపు అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సీట్ల పంపకాన్ని పూర్తి చేయడం మూడు పార్టీలకు కీలకంగా మారింది. తొలుత సీఎం చంద్రబాబుతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు - మిగతా 2 లో

అమరావతిలో మరో కీలక అడుగు



- క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్‌కు శంకుస్థాపన
- ఆంధ్రప్రదేశ్ రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ సిద్ధమైతే సుమారు 25 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని మంత్రి నారాయణ తెలిపారు
- ట్విన్ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు

అమరావతి :

అమరావతి క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్స్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ శంకుస్థాపన చేశారు. అత్యాధునిక క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా రూపుదిద్దుకోనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా రాజధాని - మిగతా 2 లో



నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారికి గుడ్ న్యూస్

- పదవీకాలం పెంచిన ఏపీ ప్రభుత్వం
- వివిధ కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవుల కాలపరిమితి పొడిగింపు
- మరో రెండు నెలల పాటు పదవీకాలం పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు
- సంక్షేమ, అభివృద్ధి పనుల కొనసాగింపు కోసమే ఈ నిర్ణయం అన్న ప్రభుత్వం

అమరావతి :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ కార్పొరేషన్లు, బోర్డులు, ఇతర సంస్థల్లో నామినేటెడ్ పోస్టుల పదవీకాలాన్ని మరో రెండు నెలల పాటు పొడిగించింది. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఛైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
బుధవారం 14 -10 - 2026

సంపాదకీయం

ఆచి తూచి 'రిజర్వ్' అడుగు!



నిత్యం చోటుచేసుకునే జాతీయ, అంతర్జాతీయ పరిణామాలూ, ప్రకృతి వైపరీత్యాలూ, వాటి పర్యవసానంగా ఏర్పడగల ఆర్థిక సంక్షోభాలపై దృష్టి పెట్టడమే, కలత పడటమే... అందుకు విరుగుడు ఆలోచించటమే రిజర్వ్ బ్యాంకు అసలు పని. గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న ఆర్థికరంగ నిపుణులు రిజర్వ్ బ్యాంకు రెపో రేటు పెంచకతప్పదని అంచనా వేస్తున్నారు. నిజానికి ఆ విషయంలో కొంత ఆలస్యం అయిందన్నది కూడా వారి విశ్లేషణ. ఏమైతేనేం...రెపో రేటును పావు శాతం పెంచుతూ బ్యాంకు ద్రవ్య విధాన సంఘం(ఎంపీసీ) భేటీ బుధవారం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల గృహ, వాహన, వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలపై వడ్డీ రేట్లు బాగా పెరుగుతాయి. మధ్యతరగతి జీవులు ఈఎంఐలకు అధికంగా చెల్లించకతప్పదు. మూడేళ్ల క్రితం రెపో రేటు పెంచాక ఇదే మొదటి పెంపు. ఇన్నాళ్లూ రెపో రేటులో ఎలాంటి మార్పు లేకుండా కొనసాగించటం... అటుపై కొంచెం కొంచెం తగ్గించుకుంటూ రావటమే అందరూ చూశారు.మొత్తానికి వడ్డీ రేటు 5.25 శాతం దగ్గర స్థిరపడింది. పావు శాతం పెంచటంతో ఇప్పుడది 5.50 శాతానికి చేరింది. కానీ ఇదింకా పెరుగుతుందన్న సంకేతాలిచ్చింది. మూడేళ్ల తటస్థంనుంచి 'క్రమానుగత కఠిన విధానం' దిశగా కదులుతున్నట్టు తెలిపింది. దసరా పండుగ సంరంభం సమీపిస్తుండగా తీసుకున్న ఈ నిర్ణయం సహజంగానే వినియోగదారుల కొనుగోలుశక్తిపై ప్రభావం చూపుతుంది. దాని తీవ్రత మరీ ఎక్కువ ఉండరాదని పావు శాతం పెంపునకు పరిమితమైంది.డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని దేశాల ఆర్థికవ్యవస్థలనూ తలకిందులు చేస్తున్నాయి. విచక్షణారహితంగా విధిస్తున్న అదనపు సుంకాలు మనతో సహా ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నాయి. ముడి చమురు ధరలు ఆకాశాన్నంటడానికి దారితీసిన పశ్చిమాసియా సంక్షోభం కూడా ఆయన పుణ్యమే. నేనున్నానంటూ సూపర్ ఎల్ నినో కూడా ఇప్పుడే వచ్చిపడింది. సాగురంగాన్ని అది తీవ్రంగా దెబ్బతీస్తోంది.వీటన్నిటివల్లా కనుచూపు మేరలో ఆశాజనకమైన పరిస్థితుల జాడ ఉండబోదని అందరికీ తెలుస్తూనే ఉంది. ఆహారధాన్యాల ధరలు అలా పైపైకి పోవటమే తప్ప కిందికి దిగొస్తున్న దాఖలా లేదు. రూపాయి పతనం ఎన్నడూ లేనంతగా ఉంది. ద్రవ్యోల్బణం పెరగటంతో నిజ వేతనాలు గణనీయంగా పడిపోయాయి. మార్కెట్‌కి వెళ్లడం పాపం... జేబు ఖాళీ అవుతోంది. మధ్యతరగతి ఆదాయాలు పడిపోతుంటే... నిరుద్యోగ భూతం భయపెడుతోంది.స్టాక్ మార్కెట్లు సరేసరి. గత తొమ్మిది నెలల్లో విదేశీ సంస్థాగత మదుపుదార్లు 4 లక్షల కోట్ల రూపాయలుపైగా వెనక్కు తీసుకున్నారని అంచనా. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాలను దాటి 7.8 శాతానికి గెంతడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అంతర్జాతీయంగా సంక్షోభం ఉన్నా మన ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉండటమే కాదు...మెరుగైన దోవన వెళ్తున్నదని కేంద్రం ప్రకటించింది. మొన్న ఆగస్టుకు ద్రవ్యోల్బణం 4.82 శాతం ఉన్నదని లెక్కేశారు.మరి అప్పుడే రెపో రేటు పెంచాల్సివుండగా ఎందుకు ఆగినట్టని ఆర్థిక రంగ నిపుణులు వేస్తున్న ప్రశ్న హేతుబద్ధమైనదే. పరిస్థితులు బాగులేవన్నది నిజమే అయినా... ఆగస్టునాటికీ, ఇప్పటికీ వచ్చిన గణనీయమైన మార్పేమీ లేదు. సరఫరాకు సంబంధించిన ఒత్తిళ్లు లేదా డిమాండ్ పరమైన ఒత్తిళ్లు ఉన్నప్పుడే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రస్తుతం ఆ రెండూ లేవు. అయినా రేటు పెంచటమంటే ముందు జాగ్రత్త అనుకోవాలి.వృద్ధి రేటు లెక్క సరికాదని విభేదించినవారు గణనీయంగానే ఉన్నారు. ఆ మాటెలావున్నా 7.8 శాతం వృద్ధి రేటు అనేది నిర్ద్వయంగా రెపో రేటు పెంచటానికి ఏ సెంట్రల్ బ్యాంకుకైనా అనువైనది. అది నేలచూపులు చూస్తుంటే పెంచితే అన్ని రకాల రుణాలపైనా వడ్డీ రేట్లు పెరిగి జనం మరింత కుంగుతారు. ఇలా బాగున్న వాతావరణమే పెంపుదలకు అనుకూలమని బ్యాంక్ భావించటంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఈ పెంపు ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తుందా లేదా అన్నది చెప్పలేం. అదనపు లిక్విడిటీని అదుపు చేయటంద్వారా అది సాధ్యమేనని ఎంపీసీలోని మెజారిటీ సభ్యులు భావించారు. చూద్దాం... ఏమవుతుందో!

అమరావతిలో మరో కీలక అడుగు

మొదటిపేజీ తరువాయి - ప్రాంతంలో సుమారు 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు.అమరావతిని గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చే దిశగా మరో భారీ అడుగు వేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ 'క్వాంటం వ్యాలీ' ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఉద్దండరాయునిపాలెంలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న క్వాంటం వ్యాలీ 11 ఎకరాల స్థలంలో నిర్మించనున్న ఐకానిక్ ట్విన్ టవర్స్ పనులకు మంత్రి పి. నారాయణ మంగళవారం భూమిపూజ చేశారు. మొత్తం 37,48,847 చదరపు అడుగుల విస్తీర్ణంతో కలిగిన ఈ టవర్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్నారు.క్వాంటం వ్యాలీలో మొత్తం ఎనిమిది టవర్లను నిర్మించాలని తలపెట్టామని, అందులో భాగంగానే ఈ మొదటి రెండు టవర్ల నిర్మాణం ప్రారంభమైందని వివరించారు. రక్షణ, వైద్యం, బ్యాంకింగ్ రంగాలతో



పాటు ప్రకృతి వైపరీత్యాల నష్ట నివారణలో క్వాంటం కంప్యూటింగ్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు."అమరావతి రాజధాని ప్రాంతంలోని 'క్వాంటం వ్యాలీ' ప్రాజెక్ట్ కోసం 50 ఎకరాల భూమిని కేటాయించి, ఎనిమిది టవర్లను నిర్మించాలని ముఖ్యమంత్రి ప్రణాళిక రూపొందించారు. అదే సమయంలో, క్వాంటం వ్యాలీ మిషన్ నిర్వహణ కోసం ఒక భవన నిర్మాణం విజయవంతంగా సాగుతోంది. ఇది పూర్తయ్యాక, అక్కడ మిషన్‌కు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేయవచ్చు. మొత్తం ఎనిమిది భవనాలకు సంబంధించిన నమూనాలు (డిజైన్లు) సిద్ధం చేశాం. వాటిలో రెండింటికి ఈ రోజు శంకుస్థాపన జరిగింది.గత నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల కొంత అంతరాయం కలిగింది. ప్రస్తుతం పనులు వేగవంతం అయ్యాయి. ప్రతి రెండు నెలలకు ఆరు అంతస్తుల చొప్పున నిర్మాణం పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామని మంత్రి నారాయణ ఎక్స్ ద్వారా తెలిపారు. అసెంబ్లీ, హైకోర్టు పునాది పనులతో పాటు ప్రజా ప్రతినిధుల నివాసాల నిర్మాణాలు కూడా చివరి దశకు చేరాయని, నవంబర్ 11 తర్వాత వీటి ప్రారంభోత్సవాలు వరుసగా ఉంటాయని మంత్రి ప్రకటించారు.

స్టార్‌లింక్‌కు అనుమతులు ఆపండి

మొదటిపేజీ తరువాయి - అనుమతులు మంజూరు చేయవద్దని, ఇందుకు సంబంధించిన ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఆరెస్సెస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎం) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అనుమతుల జాప్యంపై ఎలాన్ మస్క్ భారత ప్రభుత్వం, వ్యాపార వర్గాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎస్‌జేఎం, ఇవి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలని ఆరోపించింది.ఈ అంశంపై స్వదేశీ జాగరణ్ మంచ్ జాతీయ కో-కన్వీనర్ అశ్వినీ మహాజన్ మాట్లాడుతూ, "భారత్‌లో అనుమతుల జాప్యంపై ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారహితమైనవి. వాణిజ్య కార్యకలాపాల కోసం అనుమతులు కోరిన సంస్థ, ఆ ప్రక్రియ కొనసాగుతుండగానే ప్రభుత్వంపై, దేశీయ వ్యాపార వర్గాలపై విమర్శలు చేయడం సమంజసం కాదు. నిబంధనల ప్రకారం అనుమతులు పొందకుండా, ప్రత్యామ్నాయ మార్గాల్లో ఒత్తిడి పెంచే ప్రయత్నంగా ఇది కనిపిస్తోంది" అని విమర్శించారు."జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో ఏమాత్రం రాజీ పడకూడదు. ఉక్రెయిన్, ఇరాన్, రష్యా, చైనా, తైవాన్ వంటి పలు దేశాల్లో స్టార్‌లింక్ సేవలు ఇప్పటికే వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో, జాతీయ భద్రత దృష్ట్యా స్టార్‌లింక్‌ను నిరోధించే పూర్తి హక్కు భారత్‌కు ఉంది. మన నిర్ణయం అమెరికా వంటి వాణిజ్య భాగస్వాములకు సైతం ఒక స్పష్టమైన సందేశాన్ని పంపుతుంది" అని మహాజన్ పేర్కొన్నారు.ఒకవేళ జాతీయ భద్రత కారణాలతో స్టార్‌లింక్‌కు అనుమతులు నిరాకరిస్తే, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రోత్సహించేందుకు గొప్ప అవకాశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం మన సొంత సాంకేతికతతో ఇంటర్నెట్ సేవలను అందించవచ్చని సూచించారు. ప్రస్తుతం స్టార్‌లింక్ దరఖాస్తు ప్రభుత్వ పరిశీలనలో ఉన్న తరుణంలో, ఎస్‌జేఎం చేసిన ఈ విజ్ఞప్తి ప్రాధాన్యత సంతరించుకుంది.

సింగరేణి కార్మికులకు దసరా ధమాకా

మొదటిపేజీ తరువాయి - నికర లాభాల్లో 34 శాతాన్ని పర్మినెంట్ కార్మికులకు బోనస్‌గా అందించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన ప్రతి కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,53,913 వరకు అందనుంది. పండుగకు ముందే ఈ మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది.గతేడాది తరహాలోనే ఈసారి కూడా కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించనున్నారు. ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల్లోనూ దసరా ఆనందం నిండనుంది.బొగ్గు గనుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. పండుగ వేళ బోనస్ ప్రకటనతో కార్మికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

మొదటిపేజీ తరువాయి - పెట్టాలని రేవంత్ రెడ్డి నాయకులకు సూచించారు.నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, హైదరాబాద్ రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సామా రామ్మోహన్ రెడ్డిలు పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారభించడంతోపాటు ఆయా నాయకులతో సమావేశమవుతూ తమ గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు.మంత్రులు, ఎమ్మెల్యేలతో గంటకు పైగా జరిగిన సమీక్ష సమావేశంలో పట్టభద్రుల ఎన్నికలతోపాటు రాష్ట్రంలోని కరవు పరిస్థితులు, విద్యుత్తు కొరత లాంటి అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను ఎక్కడక్కడ తిప్పి కొట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఎన్నికలు జరుగుతున్న ఆరు ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు సమన్వయంతో పని చేయాలని, రెండు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా ఇప్పటి నుంచే కార్యాచరణతో ముందుకెళ్లాలని సీఎం సూచించారు. పలు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు నేతలకు దిశానిర్దేశం చేశారు.

సింహాలతో సీతక్క సవారీ

మొదటిపేజీ తరువాయి - మారారు. ఆమె దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా సింహాల సఫారీకి వెళ్లగా, అక్కడ సింహాల వెంటే ఎంతో ధైర్యంగా నడుస్తున్న వీడియో ఒకటి ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఆమె సాహసాన్ని చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.మంత్రి సీతక్క ఇటీవల దక్షిణాఫ్రికాలో పర్యటించారు. అక్కడి తెలంగాణ సంఘం ఆహ్వానం మేరకు బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు ఆమె వెళ్లారు. దీంతో పాటు, ఎల్ నినో ప్రభావంతో తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని, తక్కువ నీటితో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అధ్యయనం చేయడానికి కూడా ఈ పర్యటనను ఉపయోగించుకున్నారు.తన అధికారిక పర్యటనలో భాగంగా ఆమె ఓ లయన్ సఫారీని సందర్శించారు. ఈ సందర్భంగా కొన్ని సింహాలు వారు ప్రయాణిస్తున్న వాహనం వద్దకు రావడం, ఆ తర్వాత సీతక్క చేతిలో ఓ కర్ర పట్టుకుని రెండు సింహాల వెనుక ఎంతో ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో నడుస్తూ కనిపించడం వంటి దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. ఈ క్లిప్‌ను ఆమె తన సోషల్ మీడియాలో పంచుకోవడంతో అది మరింత వేగంగా వ్యాపించింది.ఈ వీడియో చూసిన నెటిజన్లు మంత్రి సీతక్క ధైర్యాన్ని కొనియాడుతున్నారు. ఆమె ఆదివాసీ నేపథ్యం, రాజకీయాల్లోకి రాకముందు నక్సలైట్ ఉద్యమంలో పనిచేసిన గతం వంటి అంశాలను గుర్తుచేసుకుంటూ, ఆ ధైర్యమే ఇక్కడ కనిపిస్తోందని కామెంట్లు పెడుతున్నారు. ఒకప్పుడు అడవుల్లో పోరాడిన ఆమె, ఇప్పుడు సింహాల మధ్య కూడా అంతే ధైర్యంగా నడవడంలో ఆశ్చర్యం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నత చదువులు (పీహెచ్‌డీ, లా) చదివి, ప్రజా జీవితంలోకి వచ్చిన ఆమె ప్రస్థానాన్ని అభినందిస్తున్నారు.

ఉగ్రవాదంపై భారత్ వెనక్కి తగ్గదు

మొదటిపేజీ తరువాయి - ఉగ్రవాదంపై పోరులో భారత్ ఎప్పుడూ వెనక్కి తగ్గదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. BIMSTEC దేశాల్లో ఉగ్రవాదులకు ఆశ్రయం దొరకకుండా సభ్య దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను దాచడం, వారికి శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చడం వంటి కార్యకలాపాలకు ఈ ప్రాంతంలో ఎలాంటి అవకాశం ఉండకూడదని చెప్పారు.దిల్లీలో మంగళవారం జరిగిన తొలి బిమ్‌స్టెక్ దేశాల హోంమంత్రుల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. సభ్య దేశాల మధ్య పరస్పర నమ్మకం, సహకారం ఉంటేనే ప్రాంతీయ భద్రతను మరింత బలోపేతం చేయగలమని తెలిపారు. ఒక దేశ భద్రతా వ్యవస్థ మరో దేశ భద్రతకు కూడా ఉపయోగపడేలా పనిచేయాలని సూచించారు. ఉగ్రవాదం వంటి సమస్యలను ఎదుర్కోవడంలో అన్ని దేశాలు ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని చెప్పారు.ఉగ్రవాదులు ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లి దాక్కోవడం, అక్కడ స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం, కొత్తవారిని నియమించుకోవడం, శిక్షణ ఇవ్వడం వంటి వాటిని అడ్డుకోవాలని అమిత్ షా అన్నారు. పొరుగు దేశాలపై దాడులకు ప్రణాళికలు వేయడం, వాటి కోసం వనరులను సమకూర్చుకోవడం వంటి చర్యలకు కూడా అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఉగ్రవాదం ఒక దేశానికే పరిమితమైన సమస్య కాదని, దాని ప్రభావం అనేక దేశాలపై ఉంటుందని ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.అందువల్ల ప్రతి దేశం తన భద్రతను మాత్రమే కాకుండా, ఇతర సభ్య దేశాల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉగ్రవాదులను, వారి సహాయకులను గుర్తించేందుకు సభ్య దేశాల మధ్య సమాచార మార్పిడి పెరగాలని అమిత్ షా చెప్పారు. ఉగ్రవాదుల వివరాలు, వారికి సహకరించే వ్యక్తులు, నేర ముఠాలు, వారి ఆర్థిక లావాదేవీలు, సరిహద్దులు దాటి జరిగే కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో పంచుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్న సంబంధిత సంస్థల ద్వారా ఈ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం వల్ల ఉగ్రవాదంపై పోరును మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంతోపాటు, దానికి అందుతున్న ఆర్థిక సహాయాన్ని నిలిపివేయడం కూడా ముఖ్యమని అమిత్ షా పేర్కొన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే మార్గాలను గుర్తించి, వాటిని అడ్డుకోవాలని సభ్య దేశాలకు సూచించారు. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే ముఠాలపై కూడా కలిసి చర్యలు తీసుకోవాలని చెప్పారు. నేరాలకు పాల్పడిన వ్యక్తులను చట్టం ముందు నిలబెట్టేందుకు సభ్య దేశాలు పరస్పరం సహకరించ



కోవాలని అన్నారు. ఆయా దేశాల చట్టాలు, కుదుర్చుకున్న ఒప్పందాలకు అనుగుణంగా న్యాయపరమైన సహాయం అందించుకోవడం, నిందితులను అప్పగించే విషయంలో సహకరించడం అవసరమని వివరించారు. ఇలాంటి చర్యల వల్ల నేరగాళ్లను పట్టుకోవడం సులభమవుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరో పెద్ద సమస్యగా మారిందని అమిత్ షా చెప్పారు. ఈ అక్రమ రవాణాను ఒక్క దేశం మాత్రమే అడ్డుకోలేదని, అన్ని దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం ద్వారా వచ్చే డబ్బు నేర ముఠాలకు బలాన్ని ఇస్తోందని, అదే డబ్బును ఉగ్రవాద కార్యకలాపాలకు కూడా ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల తయారీలో ఉపయోగించే రసాయనాలను అక్రమంగా మళ్లించడం, డార్క్ వెబ్ ద్వారా లావాదేవీలు జరపడం వంటి చర్యల వల్ల ఈ సమస్య మరింత క్లిష్టంగా మారుతోందని చెప్పారు. ఈ సమస్యలను ఎదుర్కోవడానికి ఒక్కో దేశం విడివిడిగా ప్రయత్నించడం కాకుండా, మొత్తం ప్రాంతం ఒకటిగా భావించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉగ్రవాదం, నేర ముఠాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి సమస్యలపై ఉమ్మడి కార్యాచరణ అవసరమని స్పష్టం చేశారు. BIMSTEC అంటే బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్. బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లోని దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని పెంచడం ఈ కూటమి ప్రధాన లక్ష్యం. భారత్, బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌లాండ్ ఈ కూటమిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలను కలిపే ఈ ప్రాంతంలో సుమారు 170 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఇది ప్రపంచ జనాభాలో దాదాపు 22 శాతం. ఈ దేశాల ఉమ్మడి స్థూల దేశీయోత్పత్తి సుమారు 5 లక్షల కోట్ల డాలర్లుగా ఉంది. ఈ నేపథ్యంలో తొలి బిమ్‌స్టెక్ హోంమంత్రుల సమావేశం ప్రాంతీయ భద్రతకు ప్రాధాన్యం ఇచ్చింది.

సీట్ల సర్దుబాటుపై కసరత్తు

మొదటిపేజీ తరువాయి - పల్లా శ్రీనివాసరావు, మంత్రి రామానాయుడుతో సమావేశమై చర్చించారు. ఆ తర్వాత పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు జనసేన కార్యాలయానికి వెళ్లారు. పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, ఎంపీ లింగమనేని, ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, చిల్లపల్లి శ్రీనివాస్?తో సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై వీరి మధ్య ప్రధానంగా చర్చ సాగింది.జనసేన నేతలతో భేటీ అనంతరం ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయానికి పల్లా శ్రీనివాస్, నిమ్మల రామానాయుడు వెళ్లారు. జనసేన అధినేత, ఆ పార్టీ నేతలతో జరిగిన చర్చల సారాంశాన్ని సీఎంకు వివరించారు. జనసేన చేసిన ప్రతిపాదనలపై సీఎం వద్ద చర్చించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సీఎం చంద్రబాబును ఉదయం కలిసి సీట్ల సర్దుబాటుపై మాట్లాడారు. మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. 8 గంటలకు కూటమి నేతలు సీఎం నివాసంలో భేటీ కానున్నారు. ఏ పార్టీకి ఎన్ని సీట్లు, కీలక ప్రాంతాల్లో అభ్యర్థుల ఎంపికపై ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశముంది.

నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారికి గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి - తమ విధుల్లో కొనసాగనున్నారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పాలనాపరమైన అభివృద్ధి పనుల అమలుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వాటిని మరింత వేగవంతం చేసే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం పదవుల్లో ఉన్న నేతల పనితీరు, శాఖల మధ్య సమన్వయం ఆధారంగా ఈ పొడిగింపు వర్తిస్తుందని తెలుస్తోంది.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై పలువురు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఈ పొడిగింపు కాలంలో ప్రజాసేవలో మరింత చురుగ్గా పనిచేస్తామని వారు తెలిపారు. ఈ పొడిగింపుతో అభివృద్ధి పనుల కొనసాగింపునకు మార్గం సుగమం అయిందని పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రిపై తమిళనాడు సీఎం విజయ్

మొదటిపేజీ తరువాయి - ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు.చెన్నై నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి నేరుగా ఇంద్రకీలాద్రికి బయలుదేరారు. ఆలయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకోగా, పండితులు వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు.విజయ్ ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి రాష్ట్రానికి రావడంతో విజయవాడ నగరంలో కోలాహలం నెలకొంది. ఆయన రాకను తెలుసుకున్న అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో గన్నవరం విమానాశ్రయానికి తరలివచ్చారు. ఆయన కాన్వాయ్‌ను అనుసరిస్తూ అభిమానులు తమ ఉత్సాహాన్ని చాటుకున్నారు.

ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?

మొదటిపేజీ తరువాయి - నిరసనలు చేస్తుంటే అనుమతిస్తున్నామని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు.తెలంగాణలో రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వంటి ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో సహా పలువురు నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీని, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, సైన్యాన్ని విమర్శిస్తున్నా ఆయన హక్కులను కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు.ఢిల్లీలో కాంగ్రెస్ నేతలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులు... తెలంగాణలోని బీజేపీ నేతలకు ఎందుకు ఉండవు? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుంటే సరిపోదని, అధికారంలో ఉన్నప్పుడు దానిని ఆచరించాలని హితవు పలికారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆయన గుర్తుచేశారు.

చంద్రబాబుతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

నదుల అనుసంధానం, తాగునీటిపై చర్చ

చంద్రబాబుతో తమిళనాడు సీఎం విజయ్ సమావేశమయ్యారు

వివిధ అంశాలపై దాదాపు గంటన్నరపాటు చర్చించారు

అనంతరం విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు వెళ్లారు

గోదావరి జలాలను కావేరీకి తరలించి దక్షిణాది రాష్ట్రాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చే లక్ష్యంతో ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్ కీలక చర్చలు జరిపారు. అమరావతిలోని నివాసంలో చంద్రబాబుతో విజయ్ భేటీ అయ్యారు. సుమారుగా గంటన్నరపాటు సాగిన ఈ సమావేశంలో గోదావరి – కావేరీ నదుల అనుసంధానం, చెన్నై తాగునీటి అవసరాలకు తెలుగు గంగ ద్వారా నీటి సరఫరా వంటి కీలక అంశాలపై ఇరువురు చర్చించారు.గోదావరి నుంచి కృష్ణాకు, అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు, బొల్లాపల్లి నుంచి బనకచర్ల మీదుగా పెన్నాకు, కండలేరు ద్వారా కావేరీకి నీటిని తరలించే ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వం ముందుకు తెస్తోంది. గోదావరి నుంచి వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని సద్వినియోగం చేసుకుంటే దక్షిణాది రాష్ట్రాల్లో లక్షలాది మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల భాగస్వామ్యం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ భారీ ప్రాజెక్టును సాకారం చేయాలన్నది ఏపీ ప్రభుత్వ ఆలోచన. ఈ ప్రతిపాదనలపై చర్చించేందుకు తమిళనాడు సీఎం విజయ్ చొరవ తీసుకున్నారు.మరోవైపు, చెన్నై తాగునీటి అవసరాల కోసం తెలుగు గంగ ప్రాజ

న్యాయమైన డిమాండ్ల సాధనకు గ్రామ రెవెన్యూ

సహాయకుల సమ్మె గుత్తిలో 28వ రోజుకు చేరిన నిరసన జ్వాలలు



గుత్తి (తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతోంది. గత నెల సెప్టెంబర్ 16వ తేదీన ప్రారంభమైన ఈ ఆందోళన నేటికి విజయవంతంగా 28వ రోజుకు చేరుకుంది. అనంతపురం జిల్లా గుత్తి తహశీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు చేపట్టిన నిరసన కార్యక్రమాలు మంగళవారం కూడా కొనసాగాయి. ?ప్రభుత్వ సేవల్లో ఎంతో కీలకమైన భూపరిపాలన, ప్రజా సమస్యల సేకరణ, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో అత్యవసర విధులను నిరంతరం నిర్వర్తిస్తున్న తమను ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలయ్యేలా చూడాలని, పనికి తగిన వేతనం అందించడంతో పాటు అర్హులైన వీఆర్ఏలకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ (కరువు భత్యం) బిల్లులను తక్షణమే విడుదల చేయాలని స్పష్టం చేశారు. గత నాలుగు వారాలుగా గ్రామాల్లో రెవెన్యూ సేవలను నిలిపివేసి సహాయ నిరాకరణ చేపట్టడం వల్ల గ్రామ స్థాయిలో పాలనా పరమైన పనులు తీవ్రంగా స్తంభించిపోయాయి. భూవీకరణ పత్రాల జారీ, భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, ఇతర ప్రజా పనుల్లో తీవ్ర ఆలస్యం జరుగుతుండటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుత్తి మండల వీఆర్ఏల సంఘం నాయకులు మాట్లాడుతూ, అధికారులు మరియు ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను తక్షణమే అంగీకరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి వెనుకాడబోమని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో క్రిష్టిపాడు, అప్పెచెర్ల గ్రామాల్లో పోలీసుల 'కార్డన్ అండ్ సెర్చ్'



పెద్దవడుగూరు **(తెలుగు కలం) అక్టోబర్ 13 ప్రతినిధి :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. అనంతపురం జిల్లా ఎస్పీ రాజశ్రీ ఆదేశాల మేరకు పెద్దవడుగూరు సర్కిల్ ఇన్ స్పెక్టర్ (సి.ఐ.) నరేంద్ర రెడ్డి, సబ్ ఇన్ స్పెక్టర్ (ఎస్.ఐ.) రాఘవేంద్రప్ప ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున క్రిష్టిపాడు, అప్పెచెర్ల గ్రామాలలో ఆకస్మిక 'కార్డన్ అండ్ సెర్చ్' (క్షుణ్ణమైన తనిఖీలు) నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా గ్రామంలోని పలు వీధులు, అనుమానాస్పద ప్రాంతాలను పోలీసులు పూర్తిగా అదుపులోకి తీసుకుని జల్లెడ పట్టారు. ముఖ్యంగా పాత నేరస్థులు, రౌడీషీటర్లు మరియు అల్లరి మూకల ఇళ్లను ప్రత్యేక బృందాలు విస్తృతంగా తనిఖీ చేశాయి. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా, ఎలాంటి నేర కార్యకలాపాలకు లేదా అల్లర్లకు పాల్పడినా చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా పోలీసులు రౌడీషీటర్లను గట్టిగా హెచ్చరించారు.?గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ఎవరు ప్రయత్నించినా ఉపేక్షించేది లేదని సి.ఐ. నరేంద్ర రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు కూడా ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు పూర్తిగా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా కోరారు.

ధర్మవరం 2 టౌన్ పోలీసుల 'వాక్ విత్ ఫ్రైడ్'



ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : ప్రజలలో పోలీసు వ్యవస్థ పట్ల ఉన్న పాత భయాలను తొలగించి, వారిలో నమ్మకం, ఆత్మవిశ్వాసం, గౌరవభావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ధర్మవరం టూ టౌన్ పోలీసులు 'వాక్ విత్ ఫ్రైడ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, డీఎస్పీ బీవీ జగన్నాథరాజు పర్యవేక్షణలో టూ టౌన్ సీఐ జయ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. సున్నిత ప్రాంతాలైన తారకరాంపురం, గుట్టకిందపల్లి కాలనీల్లో పర్యటించిన పోలీస్ బృందం, స్థానిక ప్రజలతో నేరుగా ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ?ఈ సందర్భంగా సీఐ జయ నాయక్ మాట్లాడుతూ, పోలీసులు ప్రజలకు దూరంగా ఉండే వ్యవస్థ కాదని, రక్షణ కోసం నిరంతరం శ్రమించే స్నేహితులని పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేసిన ఆయన, స్నేహపూర్వకంగా ఉన్నంత మాత్రాన ఉల్లంఘనలను ఉపేక్షించబోమని తెలిపారు. తప్పు చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలకు పాల్పడినా, అక్రమ మద్యం, పేలుడు పదార్థాలు, మారకాయుధాలు నిల్వ ఉంచినా, మద్యం సేవించి రోడ్లపై న్యూసెన్స్ సృష్టించినా సహించేది లేదన్నారు. పగలు, రాత్రి నిరంతరం ఫుట్ పెట్రోలింగ్, మొబైల్ గస్తీ, చెక్‌పోస్టుల ద్వారా నిఘా ఉంచుతామని వెల్లడించారు. "భయం కాదు భరోసా.. దూరం కాదు స్నేహం" అనే ప్రధాన సందేశంతో ప్రజలు నిర్భయంగా జీవిస్తూ ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని సీఐ పిలుపునిచ్చారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



గుత్తి (తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : గుత్తి మండలం పరిధిలోని స్థానిక చేట్నేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే సమీక్ష సమావేశంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వైద్యాధికారి డాక్టర్ కె. ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రతి బాలిక ఉన్నత చదువులు అభ్యసించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాలికల విద్యే మహిళా సాధికారతకు ప్రధాన పునాది అని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే చదువు మానిపించడం, బాలవివాహాలు చేయడం మరియు చిన్న వయసులోనే గర్భం దాల్చడం వంటి పరిణామాలు మహిళల శారీరక, ఆర్థిక, మానసిక, మరియు సామాజిక జీవితాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ అమర్నాథ్ మరియు డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ, సమాజంలో ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ వివక్షతకు తావులేని వాతావరణాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బేటీ బచావో – బేటీ పడావో' వంటి ప్రతిష్టాత్మక పథకాలు బాలికల ఆశాజనకమైన భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈఓ సి. వెంకటేష్, పిహెచ్‌సి ఏఎన్ఎమ్‌లు మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి 8 వీల్ చైర్ల మంజూరు



అనంతపురం(తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : అనంతపురం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి 8 వీల్ చైర్లను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మంజూరు చేశారు. ఆసుపత్రిలో వీల్ చైర్ల కొరత తీవ్రంగా ఉందంటూ వికలాంగ ప్రతిభావంతులు చేసిన అభ్యర్థనపై స్పందించిన జిల్లా కలెక్టర్, వెంటనే స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వికలాంగ ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం ద్వారా ఈ వీల్ చైర్లను ఆసుపత్రి వర్గాలకు అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, వికలాంగ ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు శ్రీమతి జి. అర్చనలతో పాటు సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు , రేపు అనంతపురంలో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 13 : ఆంధ్రప్రదేశ్ ప్రధాన అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ ఉ ఎంటైటిల్మెంట్స్) కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీలలో అనంతపురంలోని కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని రెవెన్యూ భవన్‌లో 'పెన్షన్ ఉ జీపీఎఫ్ అదాలత్' నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి అనంతపురం మరియు శ్రీ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లాల పరిధిలోని ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్ఈ) ఎస్.శాంతిప్రియ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో మొదటి రోజైన అక్టోబర్ 14న, 'రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రాసెసింగ్ సిస్టమ్' మరియు పెన్షన్ కేసులను జీపీఎఫ్ కేసులలో ఆన్‌లైన్‌లో దాఖలు చేయడంపై డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లందరికీ ప్రత్యేక వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత రెండో రోజైన అక్టోబర్ 15న పెన్షనర్లకు సంబంధించిన పలు కీలక అంశాలు మరియు వారి సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. పదవీ



విరమణ పొందిన ఉద్యోగులకు తక్షణ మార్గదర్శకత్వం అందించడం, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడం మరియు పెన్షన్, జీపీఎఫ్ సేవలను మరింత సరళతరం చేయడమే ఈ పౌర-కేంద్రీకృత కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ స్పష్టం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలతో మెరుగైన సమన్వయాన్ని పెంచుకుంటూ, డిజిటల్ గవర్నెన్స్ విధానాల ద్వారా రిటైర్మెంట్ ప్రయోజనాలను సకాలంలో ప్రాసెస్ చేసేలా ఈ అదాలత్ దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియతో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొంటారు. వారు నేరుగా పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, డీడీవోలు మరియు పెన్షన్ శాంక్షనింగ్ అథారిటీలతో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలకు క్షేత్రస్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం చూపుతారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఉద్యోగులు, పెన్షనర్లు మరియు అధికారులు ఈ అదాలత్‌లో భాగస్వాములై పారదర్శకమైన, వేగవంతమైన సేవలను పొందాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

దసరా సెలవుల్లో తరగతులు విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ



(తెలుగు కలం) అక్టోబర్ 13 : రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు దసరా సెలవుల్లో సైతం అక్రమంగా తరగతులు నిర్వహిస్తూ విద్యా హక్కు చట్టాన్ని, విద్యా ప్రమాణాలను తుంగలో తొక్కుతున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన దసరా సెలవులు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీరక విశ్రాంతికి, కుటుంబంతో గడపడానికి ఉద్దేశించినవని, అలాంటి సెలవుల్లో కూడా పిల్లలను బలవంతంగా స్కూళ్లకు రప్పించి తరగతులు నిర్వహించడం విద్యార్థుల మానసిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు.విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సు, మానసిక స్థితి దృష్ట్యా నిరంతర చదువుల ఒత్తిడి నుండి కొంత విరామం ఇవ్వాలని విద్యా నిపుణులు చెబుతుంటే, ప్రైవేట్ యాజమాన్యాలు మాత్రం ఫీజుల కోసం, సిలబస్ పేరుతో పిల్లలను వేధిస్తున్నాయని ఆరోపించారు. విద్యా ప్రమాణాల ప్రకారం ఒక విద్యా సంవత్సరంలో నిర్దిష్ట పని దినాలు, సెలవులు ఉండాలని నిబంధన ఉందని, దానిని ప్రైవేట్ స్కూళ్లు పాటించడం లేదన్నారు.ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం, ముఖ్యంగా స్థానిక ఎంఈఓ-1 ప్రైవేటు స్కూళ్లకు వత్తాసు పలుకుతూ చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. కాబట్టి విద్యార్థుల ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, విద్యా హక్కును కాపాడేందుకు దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాయదుర్గం నియోజకవర్గం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కదిరిలో ఎన్నికల భద్రత ఏర్పాట్లను పరిశీలించిన సీఐ



కదిరి (తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో రాబోయే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ఇందులో భాగంగా కదిరి టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. వెంకటేశ్వర్లు కదిరి పట్టణ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించి, అక్కడ కల్పించిన భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. ఈ తనిఖీల అనంతరం స్థానిక నానా దర్గా ప్రాంతం వద్ద ఒక వీధి కూడలి సమావేశాన్ని (స్ట్రీట్ కార్నర్ మీటింగ్) నిర్వహించి ప్రజలకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ?ఈ సమావేశంలో సీఐ మాట్లాడుతూ, ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో ఎవరూ ఎలాంటి హింసాత్మక సంఘటనలకు గానీ, గొడవలకు గానీ పాల్పడవద్దని గట్టిగా సూచించారు. ప్రజలందరూ ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరైనా ఉల్లంఘించినా లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు ప్రయత్నించినా అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా, పట్టణంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల సమాచారం తమ దృష్టికి వస్తే ప్రజలు వెంటనే పోలీసులకు లేదా డయల్ 112 కు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

ధర్మవరంలో అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో బీజేపీ నేత హరీష్ బాబు



ధర్మవరం(తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో సోమవారం సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో బీజేపీ నేత కే. హరీష్ బాబు ప్రత్యేకంగా సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక పేద కుటుంబంలో జన్మించిన సత్యకుమార్ యాదవ్.. ధర్మవరం ప్రజల ఆశీస్సులతో శాసనసభ్యుడిగా ఘన విజయం సాధించి, ప్రస్తుతం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం మంత్రి సత్యకుమార్ అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. గడిచిన 28 నెలల కాలంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టామని హరీష్ బాబు వెల్లడించారు. రాబోయే రెండున్నర సంవత్సరాల కాలంలో కోట్లాది రూపాయలతో మరిన్ని అభివృద్ధి పనులు చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. దేశంలోనే అతిపెద్దదైన చేనేత మెగా క్లస్టర్‌ను ధర్మవరం ప్రాంతానికి తీసుకువచ్చామని, అలాగే కోట్లాది రూపాయల వ్యయంతో ఆయుర్వేద మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. రాజకీయాలకు అతీతంగా, పార్టీలకతీతంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని హరీష్ బాబు సూచించారు. ప్రజల అభిప్రాయాలను ఎలాంటి మొహమాటం లేకుండా బయటపెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

గుంతకల్లులో భారీ చోరీ..

రూ.8 లక్షల నగదు, 12 తులాల బంగారం అపహరణ..





గుంతకల్లు,(తెలుగు కలం) అక్టోబర్ 13 : గుంతకల్లు పట్టణంలోని సత్యనారాయణపేట కాలనీలో భారీ చోరీ జరిగింది. శానిటేషన్ వర్కర్ సత్తెమ్మ ఇంట్లోకి చొరబడిన దుండగులు రూ.8లక్షల నగదు,12 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల మధ్య ఈ ఘటన జరిగినట్లు సమాచారం.సత్తెమ్మ తన సొంత ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి వెళ్లి అక్కడే నిద్రించారు.ఇదే అదనుగా భావించిన దుండగులు ఆమె ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది.ఉదయం ఇంటికి వచ్చిన సత్తెమ్మ బంధువులు తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి ఆమెకు సమాచారం అందించారు.దీంతో ఇంటికి చేరుకున్న సత్తెమ్మ చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.క్లూస్ టీం ఆధారాలు సేకరించగా,చోరీకి పాల్పడిన దుండగుల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కనేకల్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా చిన్న సర్మాస్ ఏకగ్రీవ ఎన్నిక





కనేకల్(తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి) కనేకల్ మండల మత్స్య సహకార సంఘం నూతన పాలకవర్గ ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా మొగలపల్లి చిన్న సర్మాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.?ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో పాలకవర్గ సభ్యులందరినీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా నిరుగంటి శ్రీనివాసులు, కార్యదర్శులుగా బి. శ్రీనివాసులు, బి. వెంకటేశులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు.?అలాగే సంఘం నూతన డైరెక్టర్లుగా బి. వెంకటేశులు, బి.ఎస్. హుస్సేన్, బెస్త చంద్ర, పి. ఖాజాపీరా, బోయ రాము, హెచ్. రామతుల్లాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ **(DDF)** విజయ్ కృష్ణ సమక్షంలో జరిగింది. ఎన్నికల అధికారిగా ఎస్.ఎన్. లక్ష్మీనారాయణ, ఎఫ్‌డీఓ **(FDO)** పెద్దబాబు నాయక్, సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్ చిరంజీవిలు ఈ ఎన్నికల సరళిని దగ్గరుండి పర్యవేక్షించారు.?అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం మొగలపల్లి చిన్న సర్మాస్ మాట్లాడుతూ... తనపై, తమ పాలకవర్గంపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న మత్స్యకారులకు, సంఘ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి, సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలను అర్హులైన మత్స్యకారులందరికీ అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో మత్స్యకారులు పాల్గొని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శులు మరియు డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

గుంతకల్లు మున్సిపల్ చైర్మన్ పదవికి

అమూల్యకు అవకాశం కల్పించాలి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కలిసిన ముష్టూరు భాస్కర్ కుటుంబం



గుంతకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 13 : గుంతకల్లు మున్సిపల్ చైర్మన్ పదవికి శ్రీరామోజి అమూల్య అలియాస్ ముష్టూరు అమూల్యకు అవకాశం కల్పించాలని కోరుతూ ముష్టూరు భాస్కర్ తన కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కలిశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అమూల్యకు అవకాశం కల్పించాలని ఆయన ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.ఎంబీఏ పట్టభద్రురాలైన అమూల్య ప్రస్తుతం సివిల్స్ సాధన లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఉన్నత విద్యావంతులైన మహిళలకు రాజకీయాల్లో అవకాశం కల్పించడం ద్వారా యువతను ప్రోత్సహించడంతో పాటు ప్రజాసేవలో మహిళల భాగస్వామ్యం పెరుగుతుందని వారు పేర్కొన్నారు.విద్య, సామాజిక అవగాహన కలిగిన యువతకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే పట్టణ అభివృద్ధికి కొత్త ఆలోచనలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అమూల్య అభ్యర్థిత్వాన్ని పరిశీలించి మున్సిపల్ చైర్మన్ పదవికి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా ముష్టూరు భాస్కర్‌తో పాటు అమూల్య, ఆమె తనయుడు ముష్టూరు అభిషేక్ ఎమ్మెల్యేను కలిసి తమ అభ్యర్థనను తెలియజేశారు.

సీఐఐ భాగస్వామ్య సదస్సు 2026కు

పకడ్బందీ ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అనంతపురం(తెలుగు కలం) అక్టోబర్ 13 : ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) వేదికగా నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు – 2026' రీజనల్ కాన్ఫరెన్స్‌కు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్‌తో కలసి కలెక్టర్ సదస్సు నిర్వహణ ప్రాంతాలైన జేఎన్టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ మరియు యూనివర్సిటీ అతిథి గృహాల్లో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ రీజనల్ కాన్ఫరెన్స్ విజయవంతం కావడానికి అన్ని ఆయా శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రతినిధులు, పారిశ్రామికవేత్తల కోసం తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా సౌండ్ సిస్టమ్, లైవ్ స్ట్రీమింగ్, బ్యాక్‌డ్రాప్, లైటింగ్, వసతి, భోజన సదుపాయాలు, పోలీసు సెక్యూరిటీ, షామియానాలు, మెటీరియల్ తయారీతో పాటు ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు పనులను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సదస్సు ద్వారా జిల్లా ప్రగతి, పారిశ్రామిక సామర్థ్యం ప్రతిబింబించేలా ఏర్పాట్లు ఉండాలని, పరిశ్రమల శాఖ మరియు ఏపీఐఐసీ అధికారులు ముందస్తుగా అన్ని అంశాలను పర్యవేక్షించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్, ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, డిఐపిఆర్ఓ బాల కొండయ్య, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

బుధవారం 14 -10 - 2026

ఎన్నికల వేళ లాడ్జిలు, హోటళ్ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి....

గది అద్దెకు ఇచ్చే ముందు గుర్తింపు పత్రాల పరిశీలన తప్పనిసరి...

ఎన్నికల అక్రమాలకు ఆశ్రయం కల్పిస్తే చర్యలు తప్పవు..

గుంతకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 13 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు లాడ్జిలు, హోటళ్ల యజమానులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీధర్ సూచించారు. అసాంఘిక శక్తులు లాడ్జిల్లో ఆశ్రయం పొందకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.లాడ్జిలో గది కేటాయించే ముందు ప్రతి వ్యక్తి చెల్లుబాటు అయ్యే ప్రభుత్వ గుర్తింపు పత్రాన్ని పరిశీలించి, సంబంధిత వివరాలను నమోదు చేయాలని తెలిపారు. బస చేసే వ్యక్తుల ఫొటో, ఫోన్ నంబరు, చిరునామా, రాకకు గల కారణాన్ని చెక్‌ఇన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తుల వివరాలను సేకరించి, అనుమానాస్పద వ్యక్తులు లేదా తప్పుడు వివరాలు అందించిన వారు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.లాడ్జిలో బస చేసే వ్యక్తులు స్థానికంగా ఎవరినైనా కలవడానికి వచ్చినప్పుడు, అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పోలీసు అధికారులు చట్టబద్ధంగా తనిఖీలు నిర్వహించినప్పుడు సంబంధిత రికార్డులను అందుబాటులో ఉంచాలని, సీసీటీవీ కెమెరాలు నిరంతరం





పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.లాడ్జి ప్రాంగణాల్లో మద్యం సేవించడం, అనుమతి లేకుండా మద్యం సరఫరా చేయడం, మద్యం మత్తులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అనుమతించరాదన్నారు. మారణాయుధాలు, తుపాకులు, ఇతర ప్రమాదకర ఆయుధాలను చట్టవిరుద్ధంగా తీసుకువచ్చే వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి ఘటనలు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు గుర్తించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా లాడ్జిల్లో రాజకీయ సమావేశాలు నిర్వహించడం, ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేయడం వంటి అక్రమ కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం కల్పించరాదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా లాడ్జిలు, హోటళ్ల యజమానులు పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సమాచారం కోసం పోలీసుల నంబర్లు :-

గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పద వ్యక్తులు, ఎన్నికల అక్రమాలు లేదా శాంతిభద్రతలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ వి. శ్రీధర్ -- 94407 96821,సబ్‌ఇన్‌స్పెక్టర్ కె. సురేష్ -- 99663 83001,సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆర్. కల్యాణ్ -- 63002 74617,పోలీస్ అత్యవసర సహాయం కోసం 100 లేదా 112 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

అక్టోబర్ 14న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

విజయవాడ (తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అక్టోబర్ 11న ఘనంగా ప్రారంభమైన ఈ ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా ఇతర



ప్రాంతాల నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాయని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. మంగళవారం ఇంద్రకీలాద్రి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఉత్సవాల పురోగతి మరియు ముందస్తు ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. శరన్నవరాత్రి మహోత్సవాల నాలుగో రోజైన అక్టోబర్ 14వ తేదీ సాయంత్రం భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఇంద్రకీలాద్రికి విచ్చేసి శ్రీ దుర్గమ్మవారిని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనుండటంతో, ఆలయ ప్రాంగణంలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు. రాష్ట్రపతి పర్యటన సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రపతి విజపి పర్యటన కొనసాగుతున్నప్పటికీ, సామాన్య భక్తుల దర్శనాలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు దేవాదాయ శాఖ తెలిపింది. దసరా నవరాత్రులను విజయవంతంగా నిర్వహించడంతో పాటు ఇంద్రకీలాద్రికి వచ్చే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శన అనుభవాన్ని కల్పించడమే లక్ష్యంగా యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోందని కమిషనర్ రామచంద్ర మోహన్ వెల్లడించారు.

దల్లాపల్లిలో ఎకో టూరిజం ప్రాజెక్టుకు భూమిపూజ

పాడేరు (తెలుగు కలం) అక్టోబర్ 13 :ప్రతినిధి : అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలం దల్లాపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ భూమిపూజ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి తిరుమణి శ్రీపూజ, జిల్లా పర్యాటక అధికారి శ్రీ చలపతిరావులతో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. పచ్చని అటవీ ప్రాంతాలు, లోయలు, జీవవైవిధ్యం, విశిష్టమైన గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన అల్లూరి జిల్లా పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో దల్లాపల్లి గ్రామంలో నూతనంగా ప్రారంభించనున్న ఎకో టూరిజం ప్రాజెక్టు ప్రాంతీయ పర్యాటక రంగానికి కీలక మైలురాయిగా నిలవనుంది.

ప్రకృతి పరిరక్షణతో కూడిన అభివృద్ధి

ప్రకృతి వనరులను కాపాడుకుంటూ పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడమే ఈ ఎకో టూరిజం ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం.



పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా సందర్శకులకు ప్రకృతి అందాలను చేరువ చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. దల్లాపల్లిలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోవడం వల్ల పాడేరు ప్రాంత పర్యాటక ప్రాధాన్యత గణనీయంగా పెరగనుంది. ప్రకృతి ప్రేమికులను, పర్యాటకులను ఆకర్షించే విధంగా అనుకూల వాతావరణం ఏర్పడి, జిల్లా పర్యాటక రంగానికి ప్రత్యేక గుర్తింపు లభించనుంది.

స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు

ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రావడం వల్ల స్థానిక గిరిజన యువతకు పర్యాటక సంబంధిత రంగాల్లో వివిధ రకాల ఉపాధి అవకాశాలు లభిస్తాయి. గిరిజన హస్తకళలు, స్థానిక ఉత్పత్తులు, సంప్రదాయ ఆహార పదార్థాలు మరియు గిరిజన సంస్కృతికి సంబంధించిన విశేషాలను పర్యాటకులకు పరిచయం చేయడం ద్వారా స్థానికుల జీవనోపాధికి భరోసా లభిస్తుంది. పర్యాటక రంగ వికాసంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటాయని అధికారులు తెలిపారు. ప్రకృతి పరిరక్షణ, పర్యాటక అభివృద్ధి, గిరిజన సంస్కృతి కాపాడటం మధ్య సరైన సమతుల్యత పాటిస్తూ ఈ ప్రాంతాన్ని బాధ్యతాయుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.

మద్దూరు వద్ద రైల్వే బ్రిడ్జి సమస్యను పరిష్కరిస్తా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

నంద్యాల(తెలుగు కలం) అక్టోబర్ 13 :నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పాణ్యం మండలం మద్దూరు గ్రామంలో రైల్వే బ్రిడ్జిల వద్ద సరైన నీటి పారుదల వ్యవస్థ లేక వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం తెలిపారు. రైతుల నుంచి అందిన ఈ సమస్యపై వెంటనే స్పందించిన ఆమె, రైల్వే అధికారులకు లేఖ రాసి తక్షణమే శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు. ఎంపీ విజ్ఞప్తికి గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా సానుకూలంగా స్పందించారు. రైల్వే మరియు రెవెన్యూ అధికారులతో సంయుక్త తనిఖీ నిర్వహించి, సాంకేతికంగా సాధ్యమైన అన్ని పరిష్కార చర్యలు చేపడతామని లేఖ ద్వారా ఆమెకు తెలియజేశారు. రైతుల ప్రయోజనాల పరిరక్షనే తన ప్రధాన ప్రాధాన్యత అని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తన కృషి నిరంతరం కొనసాగుతుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి స్పష్టం చేశారు.



రైతులకు తోడ్పాటు అందించేందుకు రాయలసీమ హార్టికల్చర్ హబ్ వారోత్సవాలు

నంద్యాల(తెలుగు కలం) అక్టోబర్ 13 :ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – రాయలసీమ రైజింగ్" కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లాలో ఉద్యాన రంగ అభివృద్ధికి, రైతుల ఆదాయ వృద్ధికి సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. జిల్లాలో సుమారు 45 వేల హెక్టార్లలో విస్తరించిన ఉద్యాన పంటలకు మొక్కల పెంపకం నుంచి సాగు, కోత అనంతర నిర్వహణ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, ఎగుమతుల వరకు అవసరమైన సాంకేతిక, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు 15 క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 12 నుంచి 17వ తేదీ వరకు రాయలసీమ హార్టికల్చర్ హబ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉద్యాన రంగంలో ఆసక్తి కలిగిన అర్హులైన రైతులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) ఉద్యాన పంటల సాగు, నాణ్యమైన మొక్కల పెంపకం, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా సూక్ష్మ సేద్యం, పంటల



ఉత్పాదకత పెంపు, కోత అనంతర నిర్వహణ, శీతల గిడ్డంగులు, ప్యాక్‌హౌస్‌లు, రవాణా, మార్కెటింగ్, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ యూనిట్ల ఏర్పాటుపై ఆసక్తి ఉన్నవారి నుంచి వివరాలు సేకరించి నమోదు చేయనున్నారు. ఉద్యాన రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతులు, నాణ్యమైన నాటే పదార్థాలు, పంటల నిల్వ, మార్కెటింగ్ సదుపాయాలు, ఎగుమతులకు సంబంధించిన అవకాశాలను సమగ్రంగా అనుసంధానించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. రైతులు పండించిన పంటలకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, పంట కోత అనంతరం జరిగే నష్టాలను తగ్గించడం, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం పొందేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ద్వారా సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి కలిగిన రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు అక్టోబర్ 17వ తేదీలోగా తమ సమీప రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే) లేదా గ్రామ ఉద్యాన సహాయకులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఐచర్ వాహనం ఢీకొని బొలెరో డ్రైవర్ మృతి

పెద్దవడుగూరు(తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : పెద్దవడుగూరు మండలం, గుత్తి అనంతపురం గ్రామ పరిధిలోని 44వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న విరుపాక్షి పెట్రోల్ బంక్ సమీపంలో నిన్న అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.



పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న ఒక బొలెరో వాహనానికి టైర్ సరిగ్గా లేకపోవడంతో, డ్రైవర్ ఉంచే ఆకాష్ వాహనాన్ని రోడ్డు ఎడమ వైపున నిలిపాడు. అనంతరం అతడు కిందకు దిగి తన వాహనం వెనుక వైపు పరిశీలిస్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ వైపు నుంచే అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన ఒక ఐచర్ వాహనం రోడ్డుపై నిలబడి ఉన్న ఆకాష్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ తీవ్ర ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పెద్దవడుగూరు సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్సై) వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు, ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు చేపడుతున్నారు.ం

దళితుల భూముల కబ్జాపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి ఏపీ ఎమ్మార్పీఎస్ డిమాండ్

తాడిమర్రి (తెలుగు కలం) అక్టోబర్ 13 :ప్రతినిధి : ఎస్సీ, ఎస్టీ బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసు అధికారులు కేసులు నమోదు చేయడానికి ఉన్నతాధికారుల అనుమతులు కావాలంటూ కాలయాపన చేయడం అత్యంత దారుణమని ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కేశగాళ్ల వెంకటేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన దళితుల భూములను ఆక్రమించేందుకు యత్నించి, ఆయుధాలతో దాడికి పాల్పడిన భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరితే, తాడిమర్రి ఎస్ఐ కృష్ణవేణి బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ/ఎస్టీ కేసులు నమోదు చేయాలంటే జిల్లా ఎస్పీ గారి అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ చెప్పడం చట్టవిరుద్ధమని మరియు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. ఈ వ్యవహారంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం నాడు తాడిమర్రిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేశగాళ్ల వెంకటేష్ మాట్లాడుతూ, శ్రీ సత్యసాయి జిల్లాలో దళితుల ఆస్తులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు కబ్జాలు, మరొకవైపు ప్రాణాంతక దాడులు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ మరియు పోలీసు యంత్రాంగం అవినీతి



పరులకు, ఆక్రమణదారులకు కొమ్ముకాయడం శోచనీయమన్నారు. బాధితురాలు పెదగంగాద్రి చిన్న గంగాద్రి కుటుంబానికి అనుకూలంగా సివిల్ కోర్టు తీర్పులు మరియు తగిన వీడియో ఆధారాలు ఉన్నప్పటికీ, ఎస్ఐ కృష్ణవేణి సాకులు చెబుతూ కాలయాపన చేయడం సరికాదన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడు బిల్లె కాటమయ్య మరియు అతని అనుచరులపై తక్షణమే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు హత్యాయత్నం, అక్రమ ఆక్రమణ, నేరపూరిత బెదిరింపుల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎం. ఆగ్రహారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 509-ఏ1 లో 3.50 ఎకరాల భూమిని తాడిమర్రి ఎమ్మార్వో అక్రమంగా తొలగించారని, ఆ రికార్డులను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. గతంలో బాధితులపైనే పోలీసులు కేసులు పెట్టిన ఉదంతాలను గుర్తుచేస్తూ, స్పందన అర్జీలు, పేపర్ కథనాలకు అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయకపోతే జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు కళ్యాణ్, ప్రభాస్, బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సాకే వినయ్ కుమార్, జిల్లా కార్యదర్శి రాంప్రసాద్, బహుజన నాయకులు సాకే కుళ్లాయప్ప, డిఎస్పీ పార్టీ నాయకులు ఓం శేఖర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

పరిటాల కుటుంబంపై తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శలు

రాప్తాడు (తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : రాప్తాడు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి, గ్రామాల్లో ఐక్యంగా ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. రాప్తాడు మండలం బండమీదపల్లిలో జరిగిన కార్యకర్తల ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబంపై ఆయన తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఉపాధి హామీ కూలీల నుంచి కమిషన్లు, టమాటా మండీ వసూళ్ల పరిటాల శ్రీరామ్‌కు 'బ్యాక్ పాకెట్ మనీ' గా మారుతుండగా, బ్రాందీ దుకాణాల అక్రమ ఆదాయం 'ఫ్రంట్ పాకెట్ మనీ'లా సాగుతోందని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో ఇసుక, ఎర్రమట్టి దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజలు ఈ మోసాలను గమనిస్తున్నారని, స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు పరస్పర విభేదాలను పక్కనపెట్టి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు.



సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల ప్రత్యేక అవగాహన సదస్సులు

పుట్టపర్తి (తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి డివిజన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో డీఎస్పీ మాణిక్యరావు నేతృత్వంలో పోలీసు యంత్రాంగం పలు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో బ్రాహ్మణపల్లి గ్రామంలో సీఐ యువరాజు, ఈగల్ ఎస్సై శ్రీధర్ తమ సిబ్బందితో కలిసి స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి స్థాయిలో ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎలాంటి గొడవలకు తావులేకుండా శాంతిభద్రతలు కాపాడటంలో గ్రామస్తులు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తీవ్రంగా హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు తెలిపారు.

ధర్మవరం సమగ్ర అభివృద్ధికి మంత్రి సత్యకుమార్ ప్రత్యేక చొరవ

రూ.2.025 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన

ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : ధర్మవరం నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే శ్రీ సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను సమీకరించారు. వివిధ కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యంతో రూ. 2.025 కోట్లకు పైగా విలువైన సదుపాయాలను సమకూర్చడంతో పాటు, పలు అభివృద్ధి ప్రతిపాదనలను సిద్ధం చేశారు. పట్టణ పారిశుధ్యం మరియు తాగునీటి ఎద్దడి నివారణ కోసం ఎస్ఈఐఎల్ సంస్థ సహకారంతో మున్సిపాలిటీకి 16 విద్యుత్ చెత్త సేకరణ వాహనాలు, 2 నీటి ట్యాంకర్లను అందించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే మున్సిపల్ భవనాల నిర్వహణ, మరమ్మతుల కోసం ఈగిల్ కోట్స్ సంస్థ రంగులను అందించింది. ప్రజారోగ్య పరిరక్షణ, భవనాల శోభను మెరుగుపరచడమే ధ్యేయంగా ఈ వనరులను కేటాయించారు. శాంతిభద్రతల పరిరక్షణ మరియు పోలీసు సేవల పర్యవేక్షణకు ప్రాధాన్యమిస్తూ ఎస్ఈఐఎల్ సంస్థ ద్వారా పోలీసు శాఖకు 5 బొలెరో వాహనాలు, ఒక డ్రోన్‌ను అందించనున్నారు. దీనివల్ల క్షేత్రస్థాయి పరిశీలన, భద్రతా పర్యవేక్షణ సులువవుతుంది. దివ్యాంగుల ఆర్థిక, సామాజిక స్వావలంబనకు తోడ్పడేలా హెచ్‌పీసీఎల్ సహకారంతో ప్రత్యేకంగా మార్చులు చేసిన 10 హ్యాండ్ కంట్రోల్డ్ ఆటోరిక్షాలు, 10 స్కూటీలను (మొత్తం విలువ



రూ. 49 లక్షలు) సమకూర్చారు. వీటి ద్వారా దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా రాకపోకలు సాగించే వెసులుబాటు కలుగుతుంది. వైద్య రంగ బలోపేతంలో భాగంగా నవజాత శిశువుల సంరక్షణకు గ్లాండ్ ఫార్మా సంస్థ ద్వారా రూ. 1.50 లక్షల విలువైన 2 బేబీ వార్మర్లను వైద్య కేంద్రాలకు అందించనున్నారు. దీనికి తోడు డాక్టర్ రెడ్డీస్ సంస్థ భాగస్వామ్యంతో నియోజకవర్గంలోని బత్తలపల్లి, మోళకవేముల, శివానగర్, కొత్తపేట, దుర్గానగర్, దర్శినమల ప్రాంతాల్లోని 6 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధునికీకరణ, వైద్య పరికరాలు, టీకా కార్యక్రమాల నిర్వహణ బలోపేతానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వ నిధులకు తోడు కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యంతో ధర్మవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా ముందుకు తీసుకెళ్లేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ శ్రీకారం చుట్టారు.

నంద్యాలలో రూ. 4.50 కోట్లతో రహదారుల అభివృద్ధికి శ్రీకారం



నంద్యాల (తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు పెట్టుబడుల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. నంద్యాల పట్టణ పరిధిలోని సంజీవనగర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ రోడ్డు వరకు (కిలోమీటరు 0/0 నుంచి 0/8 వరకు) రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న నాలుగు లేన్ల రహదారి అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని మంత్రులు మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, నంద్యాల నియోజకవర్గంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచేందుకు ఈ నాలుగు లేన్ల రహదారి పనులు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో నిధుల కొరత వల్ల రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, అయితే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల స్వల్প వ్యవధిలోనే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూ. 1,021 కోట్లు వెచ్చించి రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులు, పునరుద్ధరణ పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. నంద్యాల నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు రూ. 26 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించగా, అందులో 70 నుంచి 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన భూసేకరణ ఇతర ప్రక్రియలను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో సిరివెళ్ల, రుద్రవరం వంటి ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి వల్ల గర్భిణులు, రోగులు తీవ్ర అవస్థలు పడ్డారని గుర్తు చేస్తూ, ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థను అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ, నంద్యాల అభివృద్ధి కోసం తాము కోరిన వెంటనే నిధులు మంజూరు చేసినందుకు రోడ్లు-భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే పద్మావతి నగర్‌లో అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజల రాకపోకల కష్టాలను తీర్చామని పేర్కొన్నారు. పట్టణ ప్రజల తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపేందుకు 'అమృత్' పథకం కింద రూ. 210 కోట్ల నుంచి రూ. 213 కోట్ల వరకు నిధులు కేటాయించామని, ఈ పనుల ద్వారా మంచినీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో జలజీవన్ మిషన్, ఉపాధి హామీ పథకాల ద్వారా మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ దీపాలు, తాగునీరు, రహదారుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని వివరించారు.

రాజమండ్రి హైటెక్ బస్టాండ్ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

రూ. 8 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



రాజమండ్రి (తెలుగు కలం) అక్టోబర్ 13 : ప్రతినిధి : నగరంలో ఏళ్ల తరబడి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న హైటెక్ బస్టాండ్ ముంపు సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. సుమారు రూ. 8 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా కొబ్బరికాయ కొట్టి వైభవంగా ప్రారంభించారు. ఈ మొత్తం నిధుల్లో పబ్లిక్ హెల్త్ శాఖ ద్వారా రూ. 6 కోట్లు, నగరపాలక సంస్థ ద్వారా రూ. 2 కోట్లు వెచ్చించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, హైటెక్ బస్టాండ్ వద్ద ముంపు సమస్య గత 30 నుంచి 40 ఏళ్లుగా నగర ప్రజలను తీవ్రంగా పీడిస్తోందని గుర్తుచేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా దీనికి పరిష్కారం చూపలేకపోయిందని, అయితే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. నగరం క్రమంగా విస్తరిస్తుండటంతో కంబాల చెరువు పరిసరాల నుంచి వచ్చే మురుగునీరు, వర్షపు నీరు ప్రస్తుత ప్రధాన డ్రైన్ సామర్థ్యానికి మించి ప్రవహిస్తోందని ఆయన వివరించారు. ఈ సమస్యను శాశ్వతంగా అధిగమించేందుకు కిమ్స్ ఆసుపత్రి మార్గం మీదుగా అదనపు డ్రైన్ నిర్మించి నల్లా ఛానల్‌కు అనుసంధానం చేస్తామని ప్రకటించారు. అలాగే హైటెక్ బస్టాండ్ వద్ద లోతుగా ఉన్న రహదారిని ఎత్తు పెంచడంతోపాటు, నల్లా ఛానల్ వద్ద డబుల్ వెంట్ నిర్మాణం చేపట్టి నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. ఈ పనులన్నింటినీ రాబోయే మూడు నెలల్లోనే పూర్తి చేసేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నగర అభివృద్ధిలో భాగంగా వీఎల్ పురంలోని పాత లారీ స్టాండ్ సమీపంలో రూ. 28 కోట్లతో నిర్మించనున్న మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అరేనా-1 పనులను కూడా బుధవారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, హైటెక్ బస్టాండ్ ప్రాంతం లోతట్టుగా ఉండటం వల్ల స్వల్ప వర్షం కురిసినా నీరు భారీగా నిలిచిపోతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న డ్రైన్ సామర్థ్యం కేవలం రోజువారీ మురుగునీటి ప్రవాహానికే సరిపోతుందని, వర్షపు నీరు అదనంగా చేరడం వల్లే సమస్య తీవ్రమవుతోందని తెలిపారు. అందుకే అదనపు డ్రైన్ నిర్మాణం, రహదారి ఎత్తు పెంపు, నల్లా ఛానల్ నీటి ప్రవాహ సామర్థ్యం పెంపు పనులను సమాంతరంగా చేపడుతున్నామని చెప్పారు. పనులను వేగవంతం చేసి, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి సమస్య తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక నివాసి సత్యనారాయణ మాట్లాడుతూ, కంబాల చెరువు, హైటెక్ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని ముంపు సమస్యపై గతంలో అనేకమంది ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని, ఇప్పుడు ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు స్థానిక ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు మరియు భారీ సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రాజధానిపై ఎల్‌నినో ఎఫెక్ట్ వాటర్ ట్యాంకర్లు రాకుంటే పూట గడవని పరిస్థితి!

ఎల్‌నినో కారణంగా భూగర్భజలాలు అడుగంటి పోవడంతో హైదరాబాద్ నగరవాసులకు నీటి తిప్పలు తప్పడం లేదు. ఫలితంగా తాగునీరు సహా గృహావసరాల కోసం జలమండలి సరఫరా చేసే ట్యాంకర్లే శరణ్యం అవుతున్నాయి.ఎల్‌నినో ప్రభావంతో హైదరాబాద్ మహానగరంలో శీతాకాలంలోనే నీటి కష్టాలు తీవ్రరూప దాల్చాయి. వచ్చే వేసవికి ఆ కష్టాలు ఎలా ఉంటాయో తలుచుకుంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎల్‌నినో వల్ల సరైన వర్షాలు లేక భూగర్భజలాలు గణనీయంగా పడిపోవడంతో ఆ ప్రభావం జలమండలిపై పడింది. జలమండలి సరఫరా చేసే నీళ్లు సరిపోకపోవడంతో ట్యాంకర్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. సాధారణంగా ఐటీ కారిడార్ ప్రాంతాలైన గచ్చిబౌలి, కొండాపూర్, శేరిలింగంపల్లితోపాటు హఫీజ్‌పేట, మణికొండ, రాయదుర్గం నుంచే దాదాపు 80 శాతం వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ ఉండేది.

రెట్టింపైన ట్యాంకర్ల బుకింగ్‌లు

బోరుబావులు అడుగంటిపోవడం, నీటి సరఫరా సరిగా లేకపోవడంతో ఈ ఏడాది ఉప్పల్, ఎల్బీనగర్ లాంటి ప్రాంతాల్లో కూడా గృహావసరాలు, కమర్షియల్ వాటర్ ట్యాంకర్లు పెద్ద సంఖ్యలో బుక్ అవుతుండటం తాగునీటి ఎద్దడికి అద్దంపడుతోంది. కూకట్‌పల్లి, నిజాంపేట, ప్రగతినగర్, మియాపూర్ ప్రాంతాల్లో నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ వేల సంఖ్యలో జనం ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. గతేడాది అక్టోబర్‌లో రోజుకు 3 నుంచి 4 వేల ట్యాంకర్లు బుక్ అయితే ఈ సంవత్సరం ఆ సంఖ్య రెండింతలు పెరిగినట్లు జలమండలి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు ఎక్కువగా ఉండే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో అయితే వాటర్ ట్యాంకర్లు రానిదే పూటగడవని పరిస్థితి నెలకొంది. హాస్టళ్లు, దుకాణాలు ఎక్కువగా ఉండే అమీర్‌పేట, కృష్ణానగర్, ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ, ఎల్లారెడ్డిగూడలోనూ ట్యాంకర్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ముషీరాబాద్, చిలకలగూడలోని బస్తీలు, కాలనీల్లోనూ సాధారణ రోజుల కంటే రెట్టింపు సంఖ్యలో ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి.

డిమాండ్‌కు తగిన సరఫరా లేదు



జలమండలి ఆధ్వర్యంలో 1,250కిపైగానే ట్యాంకర్లు నడుస్తున్నాయి. 91 ఫిల్లింగ్ స్టేషన్ల ద్వారా రోజుకు దాదాపు 12 నుంచి 15 వేల ట్రిప్పుల నీటి సరఫరా జరుగుతోంది. ఒక్కో ఫిల్లింగ్ స్టేషన్ నుంచి సాధారణ రోజుల్లో 20 నుంచి 25 ట్యాంకర్లు బుక్ అయితే ఆ సంఖ్య ప్రస్తుతం 80 దాటినట్లు ఫిల్లింగ్ స్టేషన్ ఇంఛార్జులు చెబుతున్నారు. ఈ మేరకు సరఫరా ఉండటం లేదని చెప్పారు. బుక్ చేసి 24 గంటలు దాటినా ట్యాంకర్ రాని పరిస్థితి నెలకొందని నగర వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నెలకు రూ.వేలల్లో ఖర్చు పెట్టి ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు తెప్పించుకుంటున్నామని, పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోయిందని అపార్ట్‌మెంట్‌వాసులు వాపోతున్నారు. నల్లా నీళ్లు రాక వీధుల్లోకి ట్యాంకర్లు రాక తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లకు డిమాండ్ పెరుగుతుండగా ప్రైవేట్ వాళ్లు అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తోందని నగరవాసులు అంటున్నారు.

నీటి సంరక్షణ చేపట్టకుంటే చర్యలు

గడిచిన ఐదేళ్లు నగరంలో ట్యాంకర్లపై ఆధారపడిన కుటుంబాల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు జలమండలి చెబుతోంది. 2021లో 47 లక్షలు, 2022లో 68 లక్షలు, 2023లో 73 లక్షలు, 2024లో కోటి 17 లక్షలు, 2025లో 2 కోట్ల కుటుంబాలు ట్యాంకర్లను బుక్ చేసుకున్నాయి. ఈ ఏడాది ఆ సంఖ్య 3 కోట్లకు దాటే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తోంది. ప్రతికూల వాతావరణం కారణంగా డిమాండ్ ఏకంగా 30 శాతానికి పెరిగింది. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఒక్కో కుటుంబానికి ట్యాంకర్ల బుకింగ్‌పై సీలింగ్ పెట్టారు. నెలకు 4 నుంచి 8 ట్యాంకర్లు మాత్రమే బుక్ చేసుకోవాలి. నిరంతరం ట్యాంకర్లు బుక్ చేసుకుంటున్న వారు నీటి సంరక్షణ చర్యలు చేపట్టకపోతే ట్యాంకర్ ధర రెట్టింపు కూడా చేస్తామని జలమండలి హెచ్చరించింది."ప్రతి సంవత్సరం ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది. దీనికి కారణం వాటర్ సప్లై చేయకపోవడం కాదు. భూగర్భ జలాలు అడుగంటి ఎండిపోయిన బోరువావుల అపార్ట్‌మెంట్ల వాళ్లు కొత్తగా అడుగుతున్నారు. కొందరు వెంటవెంటనే బుక్ చేస్తున్నారు. అలాంటివారిపై ప్రత్యేక నిఘా పెట్టి నీటిని ఎలా వినియోగిస్తున్నారని పరిశీలిస్తున్నాం" - అశోక్‌రెడ్డి, జలమండలి ఎండీనీటి ఎద్దడి ప్రాంతాలతోపాటు బస్తీలకు కావాల్సినంత నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. బస్తీల్లోకి రావాల్సిన ఉచిత నీటిని ట్యాంకర్ల ద్వారా ప్రైవేటుగా అమ్ముకుంటున్నారన్న ఆరోపణలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. ట్యాంకర్ బుక్ చేసిన 24 గంటల్లోనే నీటిని సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. ట్యాంకర్ రాకపోతే జలమండలితో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు."ట్యాంకర్ బుక్ చేసి 24 గంటలైనా రాకపోతే జలమండలిలో ఫిర్యాదు చేయొచ్చు. ఒకవేళ అక్కడ ఫిర్యాదు తీసుకోకపోతే అప్పిలేట్ అథారిటీలో కూడా చేయొచ్చు. బుక్ చేసిన ప్రాంతాలకు 95శాతం 24 గంటల్లోపే ట్యాంకర్లను పంపిస్తున్నాం. మా ప్రభుత్వం తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. ఇప్పుడు కూడా 400 ట్యాంకర్లు ఉచితంగా ఇస్తున్నాం" - పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాల్సిందే

ఏటికేడు వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతున్నప్పటికీ ఆయా ప్రాంతాల్లో నీటి సంరక్షణ చర్యలు మొక్కుబడిగానే సాగుతున్నాయి. ఇంకుడు గుంతల నిర్మాణం, నిబంధనలు ఆశించిన స్థాయిలో అమలు చేయకపోవడంతో కోట్లాది లీటర్ల వరద నీరు మురుగు కాలువల్లో కలుస్తోంది. ఫలితంగా భూగర్భజలాలు అడుగంటి వాటర్ ట్యాంకర్లే శరణ్యమవుతున్నాయి. ఇకపై ఈ పరిస్థితి నివారించాలంటే. వచ్చే వానాకాలంనాటికి ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటుచేసుకుని వర్షపునీటిని భూమిలోకి ఇంకే విధంగా చూసుకోవాలని అధికారులు, సామాజికవేత్తలు సూచిస్తున్నారు.

ఏపీలో స్థానిక సమరానికి సై నేడే షెడ్యూల్ విడుదల

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల తర్వాత మరో భారీ సమరానికి సర్వం సిద్ధమైంది. కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలకు రేపు ఎన్నికల నగారా మోగనుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ రేపు షెడ్యూల్ విడుదల చేయనుంది. దీంతోపాటు 100 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వనుంది. మిగిలిన 23 స్థానాలకు ఇంకో రోజు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ మేరకు సీఈసీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ జారీ చేస్తున్న విషయాన్ని తెలియజేసి, అభిప్రాయాలు తెలుసుకునేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఇవాళ ఉదయం పదకొండున్నర గంటలకు 20 రాజకీయ పార్టీల ప్రతినిధులతో విజయవాడలో సమావేశం నిర్వహించనున్నారు.ఏర్పాట్లూ పూర్తి 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో మేయర్, మున్సిపల్ ఛైర్మన్ స్థానాలకు ప్రభుత్వం సోమవారం రిజర్వేషన్లు ప్రకటించింది. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఎన్నికల కమిషన్‌కు లేఖ ద్వారా తెలిపింది. ఈ మేరకు మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఒకేసారి షెడ్యూల్ ప్రకటించడంతో పాటు ముందుగా పురపాలక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది.3 దశల్లో ఎన్నికలు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకే దశలో నిర్వహించనున్నారు. రెండు దశల్లో నిర్వహించాలని పది జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల నుంచి వినతులొచ్చినా ముందుగా నిర్ణయించిన ప్రకారం ఒకే దశలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కమిషన్ నిర్ణయించింది. ఈ విషయాన్ని కలెక్టర్లు, ఎస్పీలకు స్పష్టం చేసింది. గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 28 జిల్లా పరిషత్ ఛైర్మన్ల స్థానాలకు రిజర్వేషన్లపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నేడు గెజిట్ విడుదల చేసే అవకాశం ఉంది.ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల స్థానాలకు కూడా రిజర్వేషన్లపై కలెక్టర్లు గెజిట్ ఇవ్వనున్నారు. వీటిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులు ఎస్ఈసీకి అందజేసి ఎన్నికలకు సన్నద్ధతను తెలియజేయనున్నారు. జడ్పీ ఛైర్మన్ స్థానాలకు రిజర్వేషన్లపై సందేహాలను నివృత్తి చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణతేజ, జడ్పీ సీఈవోలు, జిల్లా పంచాయతీ అధికారులతో సోమవారం నాడు సమావేశమయ్యారు. రిజర్వేషన్లు ఏవిధంగా ఖరారు చేయాలన్న దానిపై పంచాయతీరాజ్ శాఖ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవడం, వివిధ అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.



ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మ



విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో మూడో రోజు శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. దేవి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగుతుంది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఇవాళ మూడో రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. దేవి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగుతుంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్నపూర్ణాదేవి అలంకారం విశిష్టత : అన్నం పరబ్రహ్మ స్వరూపమని ఉపనిషత్తులు చెబుతున్నాయి. అన్నం సర్వజీవనాధారం, అన్నం లేనిదే జీవులకు మనుగడ లేదు. సకల జీవులకు అన్నం ప్రసాదించే దేవత అన్నపూర్ణాదేవి. తన ఎడమ చేతిలోని బంగారు పాత్రలో ఉన్న అమృతాన్నం, వజ్రాలు పొదిగిన గరిటతో తన భర్త అయిన ఈశ్వరునికి భిక్షగా అమ్మవారు అందించే అంశం అద్భుతం. సర్వపుణ్య ప్రదాయకం. లోకంలో జీవుల ఆకలిని తీర్చడం కన్నా మిన్న ఏదీ లేదు. ఈ అలంకారంలోని దుర్గమ్మను దర్శించుకుంటే ఇతరులకు సైతం అన్నదానం చేసే సౌభాగ్యాన్ని పొందుతారనేది ప్రతీతి.

స్థానిక ఎన్నికలకు కేంద్ర బలగాలు.. హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ

కేంద్ర బలగాల కోసం హైకోర్టులో లేళ్ల అప్పిరెడ్డి పిటిషన్

రాష్ట్ర పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపణ

రాష్ట్ర ఎన్నికల సంఘం, కేంద్ర హోం శాఖలను ప్రతివాదులుగా చేర్చిన వైసీపీ



ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కేంద్ర సాయుధ బలగాలను మోహరించాలని కోరుతూ వైసీపీ హైకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర పోలీసుల పనితీరుపై తమకు నమ్మకం లేదని, వారు అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.రాష్ట్ర పోలీసులు ప్రతిపక్ష కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని పిటిషన్‌లో అప్పిరెడ్డి ఆరోపించారు. ఎన్నికల సంఘం నియమించిన స్వతంత్ర పరిశీలకుల సూచనల మేరకు కేంద్ర బలగాలు పనిచేసేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు. గతంలో కేంద్ర బలగాల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసినా ఎలాంటి స్పందన రాలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం, కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీలను ప్రతివాదులుగా చేర్చారు.ఇదే అంశంపై వైసీపీకి చెందిన మరో నేత, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి కూడా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. గురజాల నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు తగిన భద్రత కల్పించేలా అధికారులను ఆదేశించాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. దీంతో ఎన్నికల భద్రత అంశం న్యాయస్థానం పరిధిలోకి చేరింది.

వివేకా హత్య కేసు వైఎస్ భాస్కర్ రెడ్డికి ఈడీ నోటీసులు.. నేడు విచారణ

మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఈడీ

మంగళవారం హైదరాబాద్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశం

ఇప్పటికే పలువురు నిందితులను ప్రశ్నించిన ఈడీ

బుధవారం అవినాశ్ రెడ్డిని కూడా విచారించే అవకాశం



మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో ఆర్థిక లావాదేవీల కోణాన్ని లోతుగా పరిశోధిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఏడో నిందితుడైన వైఎస్ భాస్కర్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆయనను ఆదేశించింది.సీబీఐ దర్యాప్తు సమాచారం ఆధారంగా ఈడీ ఈ విచారణ చేపట్టింది. హత్యకు సంబంధించిన కుట్రలో భారీగా నగదు చేతులు మారిందనే ఆరోపణల నేపథ్యంలో, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఇందులో భాగంగా నిందితుల ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది.ఈ కేసులో ఇప్పటికే సహ నిందితులైన సునీల్ యాదవ్, ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరిలను ఈడీ ప్రశ్నించింది. సోమవారం మరో నిందితుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డిని కూడా విచారించింది. తాజాగా మంగళవారం భాస్కర్ రెడ్డిని, బుధవారం ఎంపీ అవినాశ్ రెడ్డిని ప్రశ్నించేందుకు ఈడీ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. వరుస విచారణలతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతమైంది.

పరుగులు పెట్టనున్న మెట్రో ఫేజ్-2.. పర్యవేక్షణ సంస్థల నియామకంపై హెచ్ఎంఆర్ఎల్ ఫోకస్

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం

నాలుగు ప్రధాన కారిడార్లకు జనరల్ కన్సల్టెన్సీల నియామకంపై దృష్టి

కన్సల్టెన్సీల ఎంపిక కోసం పాడిగించిన టెండర్ల గడువు

పాతబస్తీ మెట్రోకు దాదాపుగా ముగిసిన భూసేకరణ

నాణ్యత, వ్యయం ఆధారంగా సంస్థల ఎంపికకు క్యూసీబీఎస్ విధానం



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ పనులు వేగం పుంజుకుంటున్నాయి. ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా, నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు అత్యంత ముఖ్యమైన జనరల్ కన్సల్టెన్సీ (జీసీ)ల నియామక ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు. మొత్తం ఏడు కారిడార్లలో తొలి దశలో నాలుగు కీలక మార్గాలకు జీసీలను ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టారు.మొత్తం రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో 122.9 కిలోమీటర్ల మేర మెట్రో ఫేజ్-2 విస్తరణ పనులు జరగనున్నాయి. ఇందులో భాగంగా రాయదుర్గం-కోకాపేట (11.6 కి.మీ.), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), ఎల్బీనగర్-హయత్?నగర్ (7.1 కి.మీ.), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.) కారిడార్ల పనుల పర్యవేక్షణ కోసం రెండు నెలల క్రితం టెండర్లు పిలిచారు. అయితే, ఆశించిన స్థాయిలో కంపెనీలు ముందుకు రాకపోవడంతో టెండర్ల గడువును ఈ నెల 22 వరకు పొడిగించారు. ఈ నాలుగు కారిడార్లకు జీసీల నియామకం పూర్తయితే పనుల్లో గణనీయమైన పురోగతి సాధించవచ్చని అధికారులు భావిస్తున్నారు.ప్రాజెక్టులో జీసీల పాత్ర కీలకంనిర్మాణ పనుల్లో జీసీల పాత్ర అత్యంత కీలకం. ప్రాజెక్టు డిజైన్ల రూపకల్పన, పనుల నాణ్యత పర్యవేక్షణ, కాంట్రాక్టర్లు, ఇతర సంస్థలతో సమన్వయం చేయడం వీరి ప్రధాన బాధ్యత. నిర్మాణ సమయంలో తలెత్తే సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు సూచిస్తూ, ప్రాజెక్టు పురోగతిని ఎప్పటికప్పుడు హెచ్ఎంఆర్ఎల్‌కు నివేదించాల్సి ఉంటుంది. జీసీల ఎంపికను 'క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్' (క్యూసీబీఎస్) పద్ధతిలో చేపట్టనున్నారు. అంటే, సంస్థల గత పనితీరు, సాంకేతిక సామర

శరీరాన్ని నడిపించే కొలెస్ట్రాల్ !

'నూనె' వెనకున్న వాస్తవాలేంటో తెలుసా?

"ఫిట్ హోగా భారత్" 30 రోజుల చాలెంజ్

మీ బాడీ ఫిట్ కోసం పర్ఫెక్ట్ వేదిక!



"ఆహారం, మానసిక ఒత్తిడి" కొలెస్ట్రాల్ హెచ్చుతగ్గులను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. కొలెస్ట్రాల్ అనగానే నూనెలు అధికంగా వాడడమే అనుకుంటారు. కానీ, యంత్రాన్ని నడిపే ఇంధనం లాగా మన శరీరానికి మంచి కొలెస్ట్రాల్ అవసరం కూడా అంతే ఉంటుంది. కొలెస్ట్రాల్ పై అవగాహన, చెడు కొలెస్ట్రాల్ ఎలా నియంత్రించుకోవాలి? అనే సందేహాలతో పాటు మీ ఆరోగ్యాన్ని, గుండె పనితీరును మరింత బలోపేతం చేసే కథనాలు, నిపుణుల సూచనల సమాహారమే "ఫిట్ హోగా భారత్".రోజురోజుకూ పెరుగుతున్న గుండెజబ్బుల నేపథ్యంలో "కొలెస్ట్రాల్" అనే పదం విస్తృతంగా చర్చనీయాంశమైంది. రక్తంలో కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండెపోటు సహా పలు ప్రమాదాలు పొంచి ఉందని వైద్యులు చెప్తుంటారు. ఈ నేపథ్యంలో కొలెస్ట్రాల్ అంటే ఏంటి? కొలెస్ట్రాల్ ఎన్ని రకాలు, కొలెస్ట్రాల్ పెరగడానికి కారణాలు, తగ్గించుకునే మార్గాలేమిటో ఇక్కడ తెలుసుకుందాం.

కొలెస్ట్రాల్ అంటే :

శరీరంలోని రక్త కణాల్లో ఉండే మైనం, కొవ్వు లాంటి పదార్థమే కొలెస్ట్రాల్. రక్తంలో ప్రధానంగా ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, హిమోగ్లోబిన్, ప్లాస్మా, కొలెస్ట్రాల్ ఉంటాయి. శరీర భాగాలు పనిచేయడానికి రక్తం అవసరం ఉంటుంది. అందుకే ఇది శరీరంలో నిరంతరం ప్రవహిస్తుంది. మనం తీసుకునే ఆహారం ద్వారా కొలెస్ట్రాల్ ఉత్పత్తి అవుతుంది. దీనికి తోడు కాలేయం కూడా కొలెస్ట్రాల్ ఉత్పత్తి చేస్తుంది. ఇదంతా కూడా తిరిగి రక్తంలోకి చేరుతుంది.

కొలెస్ట్రాల్ రకాలు! :

మంచి, చెడు కొలెస్ట్రాల్‌తో పాటు ట్రై గ్లిజరైడ్స్‌ను కలిపి కొలెస్ట్రాల్ అంటారనేది పూర్తి సారాంశం. రక్తాన్ని ప్రధానంగా హై డెన్సిటీ లిపోప్రొటీన్ (ఎణూ), లో డెన్సిటీ లిపోప్రొటీన్ (ఞణూ) అని రెండు రకాలుగా వర్గీకరించారు. అధిక సాంద్రత కలిగిన ఎణూ కొలెస్ట్రాల్ మంచిది, ఆరోగ్యాన్ని కాపాడుతుంది. తక్కువ సాంద్రత కలిగిన ఞణూ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. గుండె జబ్బులు సహా ఎన్నో ఆరోగ్య సమస్యలకు ఇదే కారణం. అత్యంత తక్కువ సాంద్రత, ట్రైగ్లిజరైడ్లను కలిగిన మరో లిపో ప్రొటీన్ ఘాణూ. ఇది గుండె ధమనులలో వ్యర్థాలు నిల్వ చేస్తుంది.

మంచి కొలెస్ట్రాల్ ఎలా ఉపయోగపడుతుందంటే! :

చెడు కొలెస్ట్రాల్‌ను లివర్ క్లీన్ చేస్తుంది. అందుకే శరీరంలోని వివిధ భాగాల్లో పేరుకున్న చెడు కొలెస్ట్రాల్ (ఞణూ)ను లివర్ దగ్గరికి తీసుకువెళ్లడంలో ఎణూ సహకరిస్తుంది. ఞణూ క్వాంటిటీ ఎక్కువగా ఉంటే రక్తప్రసరణకు అడ్డంకిగా మారి గుండె రక్తం సరఫరా తగ్గిపోతుంది.

అధిక కొలెస్ట్రాల్ లక్షణాలు ఎలా ఉంటాయంటే! :

చెడు కొలెస్ట్రాల్ (ఞణూ) పెరగడం కారణంగా శరీరం అనారోగ్యం బారిన పడుతుంది. ప్రధానంగా కనిపించే లక్షణాలు ఎలా ఉంటాయంటే!రక్తంలో కొలెస్ట్రాల్ పెరగడం వల్ల ప్రవాహం, వేగం తగ్గిపోతుంది. దీంతో గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. రక్తపోటు (హై బీపీ)కు దారి తీస్తుంది. గుండె పనితీరు మందగించి వేగంగా నడిచినా, పరిగెత్తినా ఆయాసం, గుండె దడ వస్తుంది.గుండె రక్తాన్ని శుద్ధి చేసి శరీర భాగాలకు సరఫరా చేస్తుంది కాబట్టి కొలెస్ట్రాల్ పెరగడం వల్ల రక్తం సరిగా అందక గుండెపై ఒత్తిడి పెరిగి నొప్పికి దారితీస్తుంది. ఈ కారణంగానే గుండె ఆగిపోయి ప్రాణాపాయం ఏర్పడుతుంది.

శరీరంపై ఏర్పడే గడ్డలు కూడా అధిక కొలెస్ట్రాల్ లక్షణాలే.అధిక కొలెస్ట్రాల్ వల్ల శ్వాస క్రియ రేటు కూడా మందగిస్తుంది. ఛాతీ మీద బరువుగా అనిపించడంతో పాటు ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది.రక్త ప్రసరణ తగ్గిపోవడం వల్ల కాళ్లలో తిమ్మిర్లు ఏర్పడతాయి. మొద్దుబారినట్లుగా అనిపించి స్పర్శ తెలియకపోవడాన్ని చాలా సార్లు మనం గమనించే ఉంటాం.

కొలెస్ట్రాల్ పెరగడానికి కారణాలు :

ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది ఒత్తిడికి గురవుతున్నారు. వేళకు తినకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, ఎక్కువ సేపు కూర్చుని పని చేయడం వంటివి శరీరంలో కొలెస్ట్రాల్ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా వైద్యులు పేర్కొంటున్నారు.ఆహారం విషయానికొస్తే ఆరుబయట తినుబండారాలు, వేపుళ్లు, జంక్ ఫుడ్, ప్రాసెసింగ్ ఫుడ్ తీసుకోవడం వల్ల రక్తంలో కొలెస్ట్రాల్ పెరుగుతుంది. రెడ్ మీట్, కొవ్వు, పాల ఉత్పత్తులు, చాక్లెట్, ప్రాసెస్ ఫుడ్ వల్ల ఞణూ పెరుగుతుంది. శారీరక శ్రమ లేకపోవడం, మద్యపానం, ధూమపానం అలవాట్లు ఈ సమస్య మరింత పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి.మానసిక ఒత్తిడి, నిద్ర లేమి కారణంగానూ కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతున్నాయి. హార్మోన్ల సమతుల్యత, జీవక్రియ సజావుగా సాగడంలోనూ కీలక పాత్ర పోషించే నిద్ర లేకపోవడం వల్ల కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లు పెరుగుతున్నాయని వైద్యులు చెప్తున్నారు.కూల్ డ్రింక్స్, చిరుతిళ్లు, వైట్ బ్రెడ్ లాంటి రిఫైన్డ్ కార్బోహైడ్రేట్ పదార్థాలు మంచి కొలెస్ట్రాల్ తగ్గించేలా ఇన్సులిన్, ట్రైగ్లిజరైడ్ల ఉత్పత్తిని పెంచుతున్నాయి. ఇళ్లు, ఆఫీసుల్లో అదే పనిగా గంటల తరబడి కూర్చోవడం కూడా ప్రమాదకరమే. తద్వారా రక్తంలో కొవ్వు పదార్థాల విచ్ఛిన్నం తగ్గిపోయి హెచ్‌డీఎల్ కూడా తగ్గిపోతుంది. శరీర బరువు పెరుగుతుందంటే కొలెస్ట్రాల్ స్థాయి కూడా పెరుగుతుందని తెలుసుకోవాలి. అధిక శరీర బరువు బీపీ, షుగర్ రావడానికి మూలకారణం.

వ్యాధులూ కారణమే! :

షుగర్ వ్యాధి, హైపోథైరాయిడిజం సమస్య వల్ల కూడా కొలెస్ట్రాల్ స్థాయులు పెరుగుతున్నాయని వైద్యులు వెల్లడిస్తున్నారు. శరీరంలో అధిక చక్కెర, థైరాయిడ్ గ్రంధి శరీరానికి అవసరమైన హార్మోన్లను ఉత్పత్తి చేయలేని (హైపోథైరాయిడిజం) పరిస్థితిలోనూ కొలెస్ట్రాల్ పెరుగుతుందని చెప్తున్నారు.

జన్యుపరమైన కారణాలు :

కుటుంబ హైపర్‌కొలెస్టెరోలేమియా (ఖీఎ) అనేది వారసత్వంగా సంక్రమిస్తుందని వైద్యులు చెప్తున్నారు. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడానికి ఇది కూడా కారణమే.

కొలెస్ట్రాల్ ఇలా తగ్గించుకోవచ్చు :

కొలెస్ట్రాల్ ఎందుకు పెరుగుతుందో తెలిస్తే దానిని తగ్గించుకోవడం చాలా ఈజీ. శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక ఒత్తిడిని దూరం చేసుకోవడంతో పాటు ఆహారపు అలవాట్లు మార్చుకోవడం వల్ల కొలెస్ట్రాల్ సమస్యకు చెక్ పెట్టొచ్చు. వ్యాయామం, శారీరక శ్రమ తప్పనిసరి.రోజూ కనీస వ్యాయామం చేయడం వల్ల ఊబకాయం సమస్యకు చెక్ పెట్టడంతోపాటు శరీర బరువు అదుపులో ఉంటుంది. ఊబకాయం సమస్య ఉన్న వారిలో సహజంగా కొలెస్ట్రాల్ కూడా ఎక్కువగా ఉంటుంది కాబట్టి బరువు తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలి.వ్యాయామం, క్రీడల్లో పాల్గొనడం లాంటి శారీరక శ్రమ వల్ల రక్తంలోకి మంచి కొవ్వు విడుదలై రక్తనాళాల్లో పోగుపడిన చెడు కొవ్వును కాలేయానికి చేరవేస్తుంది. దీంతో కాలేయం చెడు కొలెస్ట్రాల్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. అందుకే పెద్దలు వారంలో 150 నిమిషాలు కనీస వ్యాయామం, లేదా 75 నిమిషాల తీవ్ర వ్యాయామం చేయాలని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సిఫారసు చేసింది. వాకింగ్, స్విమ్మింగ్, డ్యాన్స్ కూడా సాధన చేయొచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల కొలెస్ట్రాల్ సమస్య అదుపులో ఉంటుంది.రైస్ బ్రాన్ ఆయిల్ మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి సహాయపడుతుంది. రైస్ బ్రాన్ ఆయిల్‌లో ఒరైజనాల్ ఉంటుంది, ఇది గుండెకు మేలు చేస్తుంది. ఒరైజనాల్ టోకోఫెరోల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి.ఆహారంలో మార్పుల ద్వారా కొలెస్ట్రాల్ అదుపులో ఉంచుకోవచ్చు అని ఎన్నో పరిశోధనలు నిరూపిస్తున్నాయి. జంక్ ఫుడ్స్, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించడంతో పాటు ఫైబర్ ఎక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవాలి. చిక్కుళ్లు, పప్పులు, శనగల వంటి ప్రొటీన్, ఓట్స్, బార్లీ వంటి పైబర్ పదార్థాలు ఎంచుకోవాలి. యాపిల్, బత్తాయి, నారింజ పండ్లతో పాటు బాదం, పిస్తా, పొద్దుతిరుగుడు, గుమ్మడి విత్తనాలు తరచూ తీసుకోవాలి.

స్వచ్ఛమైన నెయ్యి :

సహజ పద్ధతుల్లో తయారు చేసిన నెయ్యి వాడకం వల్ల మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. నెయ్యిలో సమృద్ధిగా లభించే కంజుగేటెడ్ లినోలెయిక్ ఆమ్లం (సీఎల్ఏ) హెచ్‌డీఎల్ స్థాయిని పెంచుతుంది. పాలు మరిగించి తోడు పెట్టి పెరుగు మీగడ ద్వారా తీసిన నెయ్యి శ్రేష్ఠమైంది.

తెలుగు కవిత్వంలో ఓ వజ్రపు తునక



వాన వెలిశాక మట్టి వాసన, ఆరుద్ర పురుగుల సర్కస్ ఫీట్లు, పిచ్చుకల మట్టి స్నానాలు, వెన్నెల్లో ఆడిన ఆటలు, ఎండకాలం బావుల్లో ఈతలు ఈనాడేవి? మన చిన్నతనం మనకు చిన్నతనం కాదు. బాల్యం మళ్లీ రమ్మంటే వస్తుందా? 'అనుభూతులను పోగొట్టుకున్న గుండె ఎడారి. అనుభూతులను పదిలపరచుకున్న గుండె సతత హరితారణ్యం'. ఇటువంటి మధురమైన భావాల సుమమాల డాక్టర్ నలిమెల భాస్కర్ 'సుద్దముక్క'. ఈ పుస్తకంలో శ్రామిక జనజీవన చిత్రణం ఆర్ద్రంగా ఉంటుంది. శ్రామికుల రుణం తీర్చుకోవాలనిపించేలా చేస్తుంది. తమ బతుకులను బండలకేసి బాదుకుంటూ మన బట్టలను గట్టున ఆరేస్తారు రజకులు. మన బట్టలను పిండి వాళ్లు తోలు బొమ్మలవుతారు. వాళ్లుతికిన దుస్తులతో మనం మన లోపలి ముఖాన్ని, మురికినీ చాటు చేసుకొని రోజూ నాగరికులమవుతాం. ఎవరి బట్టలను వారికి, తప్పిపోకుండా అందించే అమోఘమైన జ్ఞాపకశక్తి వారిది. 'సమాజ కల్మషాన్ని కడిగివేయడానికి/ కంకణధారులైన వ్యక్తులు సంస్కర్తలైనప్పుడు/ తరతరాలుగా మైలబట్టల్ని/ మల్లెపూలు ఉల్లిపొరలూ చేసేందుకు/ కటిబద్ధులైన వీళ్ళూ సంస్కర్తలే'. ఇలాంటివన్నీ ఒక ఎత్తు అయితే.. ఉపాధ్యాయుని గురించి, సుద్దముక్క గురించి రాసిన ఆరు కవితలు మరొకెత్తు. ఆ ఆరు కవితలలో ఉపాధ్యాయున్ని ప్రపంచాన అగ్రభాగాన నిలిపారు నలిమెల. అధ్యాపకునికి అక్షరాభిషేకం చేశారు. 'అతడు కాలుమోపడం తోటే అణువణువూ అక్షరమవుతుంది/ అతని మాటల రెక్కల మీద/ పిల్లలు అత్యంత సురక్షితంగా/ జ్ఞాన విహాయసంలో విహరించి వస్తారు' అని ఉపాధ్యాయుడి ఔన్నత్యాన్నీ, 'క్లాసులో ప్రవేశిస్తున్న ప్రతిసారీ/ అతని కుడిచేతికి ఆరో వేలు/ అని చాక్‌పీస్ ప్రాధాన్యాన్ని వెల్లడిస్తారు. సుద్దముక్క సూర్యగోళం నుంచి కోసుకొచ్చిన రశ్మి శకలం. చందమామ నుంచి తీసుకొచ్చిన వెన్నెలగడ్డ అన్నప్పుడు భాస్కర్ కవిత్వం తారస్థాయికి చేరుతుంది. సౌందర్యోపేతం అవుతుంది. చాకిపీస్ విద్యార్థులకు 'సమస్తమైన దిక్కులను నిర్దేశించగల చుక్కాని/ తరగతికి వెళ్లే ఉపాధ్యాయునికి ఊపిరి గుళిక/ ఉపన్యాసకులకు ఊతకర్ర'. భాస్కర్ దృష్టిలో ఈ భూమండలం మీద ఏకైక లోకైక దర్శనీయ స్థలం 'బడి'. 'సుద్దముక్క' తెలుగు కవిత్వంలో ఓ వజ్రపు తునక. ఇందులో అడుగడుగునా కవిత్వం, అణువణువునా నవత్వం, ప్రతివాక్యం ఆస్వాదయోగ్యం, అనుభవైకవేద్యం.

ఏది తల్లీ గట్లుంటది నాటి సాహిత్యం

ఏదీ ఎక్కడా కానరావేం మన దగ్గరనే కాదు

పొరుగునే అని కూడా కాదు, మొత్తం ప్రపంచవ్యాప్తంగా కూడా ఆ ఉధృతి తగ్గింది. వ్యక్తిగత వ్యవహారాలకే పరిమితమవుతున్న కవిత్వమే తప్ప సామాజిక పట్టింపు ఎక్కడా కానరాదేం. ముఖ్యంగా మహిళలు రాసే కవిత్వం ప్రేమ రాహిత్యం, వ్యక్తిగత వైఫల్యాలపై వస్తున్నాయే తప్ప సామాజిక, సామూహిక వైఫల్యాలపై ఎందుకు నిరసన కవిత్వం రావడం లేదు. ఆనాటి ఆవేశం నేడు ఎక్కడా కానరావడం లేదేం? ఆనాడు వచ్చిన ఫెమినిస్ట్ కవిత్వం నేడు ఎందుకు రావడం లేదు? ఆనాటి ఫెమినిస్ట్‌లు తమ తర్వాత తరానికి ఆ ఆయుధాలను ఇవ్వలేకపోవడమా లేక ఈనాటి కవయిత్రులు ఆ తరాన్ని అందుకోలేకపోవడమా అసలు కారణమేంటి? ఒకరిద్దరు మినహా మిగిలిన కవయిత్రులంతా తమ కవిత్వాన్ని వ్యక్తిగతానికే పరిమితం చేస్తున్నారు. ఆ రోజులతో పోలిస్తే నేడు కవిత్వ ప్రకటనలకు అనేకానేక వేదికలున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో కవిత్వం ఏరులై పారుతున్నది. నిజానికి పత్రికలు కవిత్వానికి ఇస్తున్న స్పేస్ చాలా అంటే చాలా తగ్గిపోయింది. కొన్ని పత్రికలైతే అసలు సాహిత్యం ఓ ఆలంబన అనే విషయాన్నే వదిలేసి ఏండ్లు గడిచిపోయాయి. మిగిలిన సామాజిక మాధ్యమాల్లో కూడా సామాజిక అంశాలపై కవిత్వం రాస్తున్న వారు పెద్దగా కానరావడం లేదు. 80, 90వ దశకాల్లో మహిళలు రాసిన కవిత్వం చదివి చాలామంది ప్రేరణ పొందారు. ఆ కవిత్వాల ద్వారానే కొన్ని ఉద్యమాలు వచ్చాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా నీలిమేఘాలు కవిత్వ సంపుటి తీసుకొచ్చిన తుఫాను.. అలాంటి ఇలాంటి తుఫాను కాదు. అంతవరకూ వ్యక్తులుగా ఉన్న కవయిత్రులంతా ఆ నీలిమేఘాలు అనంతరం సామూహికం అయ్యారు. అందులో ఒక్కో కవితా ఒక్కో తూటాలా మహిళలను కదిలించింది. పురుషులైతే ఇలా ఉన్నామా ఇలా బతుకుతున్నామా? అని తమని తాము ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చింది. అప్పటికింకా చదువు, సంధ్యల్లో గడుపుతున్న నాలాంటి వాళ్లకు నీలిమేఘాలు ఓ సంచలన, సంభ్రమాశ్చర్య కవిత్వ సంపుటి. ఆ సమయంలో ఓల్గా, విమల, జయప్రభ, ఘంటశాల నిర్మల, మందరపు హైమవతి, కొండేపూడి నిర్మల వంటి వారి కవిత్వం చదివి ఉప్పొంగిపోయిన సందర్భాలు ఎన్నో ఎన్నెన్నో. ఆ కవయిత్రుల్లో కొందరు పూర్తిగా కవిత్వానికి దూరమయ్యారు. మిగిలినవారు రాస్తున్నా ఆ నాటి వాడి, వేడి ఎందుకు తగ్గిందో? మహిళలందరూ.. 'ఎవరి బతుకులు వారివే. మనకెందుకు ఇదంతా' అనే ఓ నిర్లిప్త వాతావరణంలోకి వెళ్లిపోయారా? సామూహికంగా మారి ఓ ఉద్యమ స్థాయిలో కవిత్వాన్ని పండించినవారంతా ఇప్పుడు ఒక్కరుగానే



మిగిలిపోతున్నారా? అప్పట్లో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. దానికి తోడు సమాజంలో ఓ చిన్నచూపు. కానీ, నేడు పరిస్థితులు కొంత మారాయి. ముఖ్యంగా దేశంలో గ్లోబలైజేషన్ కారణంగా వచ్చిన మార్పులు అన్నీ ఇన్నీ కావు. ఐటీ ప్రవేశంతో జీవితాలు మారిపోయాయి. స్త్రీలకు తాము చదివిన చదువులకు తగ్గట్టుగా ఉద్యోగాలు వచ్చాయి. ఆర్థిక స్వావలంబన పెరిగింది. పురుషుడితో సమానంగా తానూ ఎదిగాననే ఆత్మవిశ్వాసం వచ్చింది. లక్షల్లో జీతాలతో పాటు తన కోర్కెలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశాలు వచ్చాయి. దీని ప్రభావం సాహిత్యం మీద పడిందా? ఇవన్నీ ప్రశ్నలే. జీవితం సంతృప్త స్థాయికి చేరిందనుకోవాలా? అందుకే వ్యక్తిగత వ్యవహారాలకే నేటి కవయిత్రులు పరిమితమవుతున్నారని భావించాలా? ఇదంతా కావచ్చు కానీ నా మటుకు నాకు అనిపించింది ఏమిటంటే.. ఓ కేంద్రీకృత ఉద్యమం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. అసలు ఉద్యమం అనేదే లేకుండాపోయింది. కథకుడు ఖదీర్‌బాబు చెప్పినట్టు 'కనీసం ఊళ్లు పట్టుకు ఊరేగడానికి ఉద్యమమూ లేదు' అన్నట్టుగా మారింది. అమ్మ నవలలో 'పావెల్ చేత మన ఆలోచనలన్నింటికీ కేంద్రం ఉద్యమమే కావాలి' అని మాక్సిం గోర్కీ చెప్పిస్తాడు. ఆ కేంద్ర స్థానాన్ని, ఆ ఉద్యమాన్ని ఇక్కడివారు పట్టించుకోకపోవడం వల్లనే ఇలా జరుగుతోందా? రాష్ట్రం విడిపోవడానికి ముందు తెలంగాణ సాధన కోసం అనేక మంది కవయిత్రులు ఉద్యమ కవిత్వాన్ని అద్భుతంగా రాశారు. దాని ప్రభావం కచ్చితంగా ఉద్యమంపై పడి అది మరింత బలపడింది. కవిత్వమో, పాటో, కథో, నవలో మొత్తానికి తెలంగాణ ఉద్యమానికి అనుకూలంగా, ప్రత్యేక రాష్ట్రం రావాల్సిన అవశ్యకతపై సాహిత్య సృజన జరిగింది. రాష్ట్రం సిద్ధించింది. చిరకాల కోరిక ఈడేరింది. ప్రాంతీయ ఉద్యమాలే ఆలంబనగా ఆ సాహిత్యం వచ్చింది. అయితే, ఆ తర్వాత అంతే ఉద్యమ, సామాజిక స్ఫూర్తిని ఇవ్వాల్సిన సాహిత్యం కూడా నిలిచిపోయిందా. ఇప్పుడూ కవయిత్రులు రాస్తున్నారు కదా అనే ప్రశ్న రావచ్చు. వస్తోంది. ఆ కాలంతో పోల్చుకుంటే చాలా తక్కువగానే రాస్తున్నారు. తాము స్పందించకపోతే ఎలా అనే కారణంగానే ఒకటి, రెండు రాస్తున్నారు. ఎక్కువగా మాత్రం కవయిత్రులు తమ వ్యక్తిగతానికే పరిమితం అవుతున్నారని అనిపిస్తున్నది. అంతకుముందు ఉమ్మడి ఏపీలో వచ్చిన అనేకానేక ఉద్యమాలకు స్ఫూర్తి ఆ నాటి సాహిత్యమే. ఆ తర్వాత వచ్చిన పరిణామాల ప్రభావం సాహిత్యంపై పడటమే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఇప్పుడు రాస్తున్న కవయిత్రుల్లో చాలామంది అద్భుత కవిత్వాన్నే రాస్తున్నారు. కానీ, ఎక్కడో ఓ వెలితి వెంటాడుతోంది.

రోజూ ఉదయం కడుపులో మంటగా ఉంటుందా అయితే ఈ చిట్కాలను పాటించండి



సాధారణంగా చాలా మంది అప్పుడప్పుడు అసిడిటీ సమస్యతో బాధపడుతుంటారు. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. కారం, మసాలాలు ఉన్న ఆహారాలను అధికంగా తినడం, వేళ తప్పించి భోజనం చేయడం, టీ, కాఫీలను అతిగా తాగడం, భోజనం ఎక్కువగా తీసుకోవడం వంటి అనేక కారణాల వల్ల అసిడిటీ వస్తుంది. దీంతో ఏం చేయాలో తోచదు. మెడికల్ షాపుకు వెళ్లి మందులను కొని తెచ్చి వేసుకుంటారు. అయితే దీర్ఘకాలంలో ఇలా చేయడం మంచిది కాదు. దీంతో పలు సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. ఇక కొందరికి రోజంతా అసిడిటీ ఉండదు. కానీ ఉదయం పూట మాత్రం అసిడిటీ ఉంటుంది. ఇలాంటి వారు కింద చెప్పిన పలు చిట్కాలను పాటించడం వల్ల అసిడిటీ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. దీంతో ఎంతగానో రిలీఫ్ లభిస్తుంది.

నిమ్మరసం..

అసిడిటీ సమస్యను తగ్గించడంలో నిమ్మరసం ఎంతగానో పనిచేస్తుంది. అయితే నిమ్మరసం కూడా యాసిడ్‌ను కలిగి ఉంటుంది కదా.. అని చాలా మంది అనుకుంటారు. కానీ నిజానికి నిమ్మరసాన్ని మనం తాగితే అది మన శరీరంలో చేరాక ఆమ్లత్వాన్ని కోల్పోతుంది. దీంతో మనకు మేలు జరుగుతుంది. కనుక అసిడిటీ సమస్య ఉన్నవారు నిరభ్యంతరంగా నిమ్మరసం తాగవచ్చు. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కాస్త నిమ్మరసం కలిపి తాగితే అసిడిటీ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే అజీర్ణం కూడా తగ్గుతుంది. ఇక ఉదయాన్నే పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో కలబంద రసాన్ని సేవిస్తున్నా కూడా జీర్ణ సమస్యల నుంచి బయట పడవచ్చు. జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరచడంలో కలబంద ఎంతగానో పనిచేస్తుంది. కలబంద రసాన్ని సేవిస్తుంటే అసిడిటీ నుంచి తక్షణమే ఉపశమనం లభిస్తుంది. దీంతోపాటు గ్యాస్, కడుపు ఉబ్బరం కూడా తగ్గుతాయి.

సోంపు గింజలు..

ఉదయం అసిడిటీ ఎక్కువగా ఉంటే దాన్ని తగ్గించేందుకు సోంపు గింజలు కూడా ఎంతగానో పనిచేస్తాయి. సోంపు గింజలను తీసుకుని నోట్లో వేసుకుని నమిలి తింటుంటే అసిడిటీ తగ్గుతుంది. లేదా సోంపు గింజలను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతుండవచ్చు. దీంతో కూడా జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇక జీర్ణ సమస్యలను తగ్గించడంలో అల్లం కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. రోజుకు రెండు సార్లు భోజనానికి ముందు అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో సేవించాలి. అల్లం రసం కడుపులో మంటను తగ్గిస్తుంది. పొట్టను ప్రశాంతంగా ఉండేలా చూస్తుంది. పొట్టలో ఉండే అసౌకర్యాన్ని కూడా తగ్గిస్తుంది.

చల్లని పాలు..

వేడి పాలను తాగితే పొట్టలో ఆమ్లత్వం పెరుగుతుంది. కానీ చల్లని పాలను తాగితే పొట్టలో ఆమ్లత్వం తగ్గుతుంది. దీంతో అసిడిటీ నుంచి బయట పడవచ్చు. కనుక కడుపులో మంటగా ఉన్నప్పుడు వేడి పాలను కాకుండా చల్లని పాలను తాగితే మేలు జరుగుతుంది. కడుపులో రోజంతా మంటగా ఉండేవారు కొబ్బరినీళ్లను తాగుతుండాలి. దీంతో చక్కని ఉపశమనం లభిస్తుంది. అలాగే తులసి ఆకులను నేరుగా అలాగే తింటున్నా కూడా కడుపులో మంట నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇలా పలు చిట్కాలను పాటించడం వల్ల కడుపులో మంటను తగ్గించుకోవచ్చు. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది.

కలబందను అసలు ఎలా తీసుకోవాలి



ఆయుర్వేద ప్రకారం కలబంద ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కలబందలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కలబంద గుజ్జును తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. చాలా మంది ప్రస్తుతం కలబందను ఇండ్లలోనే పెంచుతున్నారు. దీంతో మనకు కలబంద ఎప్పుడు కావాలంటే అప్పుడు లభిస్తుంది. ఇక మార్కెట్‌లోనూ కలబంద జ్యూస్‌ను విక్రయిస్తున్నారు. దీన్ని కూడా మనం ఉపయోగించవచ్చు. అయితే కలబంద నిజంగా మనకు ఆరోగ్య ప్రదాయిని అనే చెప్పవచ్చు. కలబంద జ్యూస్‌ను తాగడం లేదా కలబంద గుజ్జును ఉపయోగించడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అందానికి, శిరోజాల సంరక్షణకు కూడా కలబంద ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే దీన్ని ఎలా తీసుకోవాలి అనే విషయం చాలా మందికి తెలియదు.

ఇలా తీసుకోవాలి..

కలబంద గుజ్జు లేదా జ్యూస్‌ను నేరుగా అలాగే తీసుకోవచ్చు. అయితే కలబంద రుచి కొందరికి నచ్చకపోవచ్చు. ఇది కొందరికి చేదుగా, వగరుగా అనిపిస్తుంది. కనుక అలాంటి వారు తేనెను చేర్చి తీసుకోవచ్చు. అయితే కలబందను అలర్జీలు ఉన్నవారు తీసుకోకూడదు. కలబందను తింటే కొందరికి పడదు. దీంతో వారికి చర్మంపై దురదలు వస్తాయి. కొందరికి వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. కనుక ఈ సమస్యలు ఎదుర్కొనే వారు కలబందను తినకూడదు. కలబందలో మన శరీరానికి ఉపయోగపడే అనేక ఔషధ గుణాలతోపాటు విటమిన్లు, మినరల్స్ కూడా ఉంటాయి. అందువల్ల కలబందను రోజూ తింటే అనేక లాభాలను పొందవచ్చు.

రోగ నిరోధక శక్తికి..

కలబందను రోజూ ఒక టీస్పూన్ మోతాదులో జెల్ తినవచ్చు. అదే జ్యూస్ అయితే రోజూ 30 ఎంఎల్ మోతాదులో తాగవచ్చు. కలబందలో విటమిన్లు ఎ, సి, ఇ, పలు రకాల బి విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. కలబందలో ఉండే విటమిన్ ఎ మన శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే కంటి చూపును మెరుగు పరుస్తుంది. కలబందను రోజూ తీసుకోవడం వల్ల కంటి చూపు పెరిగి కళ్లద్దాలను తీసి పడేస్తారు. ఇక కలబందలో ఉండే విటమిన్ సి మన శరీర ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతుంది. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. తీవ్రమైన వ్యాధులు రాకుండా ఉంటాయి.

శిరోజాలు, ముఖానికి..

కలబంద మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. కలబందను రోజూ తింటుంటే జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్దకం తగ్గుతాయి. జీర్ణవ్యవస్థలో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. కలబంద శిరోజాలు, ముఖానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. దీంతో తయారు చేసే ఫేస్ ప్యాక్ లేదా హెయిర్ ప్యాక్‌లను ఉపయోగించడం వల్ల ముఖం కాంతివంతంగా మారడమే కాదు, శిరోజాలు ఆరోగ్యంగా కూడా ఉంటాయి. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. కలబందలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. గుండె పనితీరు మెరుగు పడుతుంది. ఇలా కలబంద వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

అమ్రపాలి గ్రూప్ మనీలాండరింగ్ కేసు.. రూ. 54.71 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసిన ఈడీ



సంచలనాత్మక అమ్రపాలి గ్రూప్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈడీ లక్నో జోనల్ కార్యాలయం సుమారు రూ. 54.71 కోట్ల విలువైన భారీ స్థిరాస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద తాజాగా జప్తు చేసింది. న్యూఢిల్లీలోని అత్యంత ప్రతిష్టాత్మక ప్రాంతమైన మహారాణి బాగ్‌లో ఉన్న 3 (న్యూ) నంబరు గల ఈ ఆస్తిని 'సుర్భి అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్' పేరు మీద నమోదు చేసినట్లు దర్యాప్తులో తేలింది. కొనుగోలుదారులను మోసగించిన ఈ కేసులో ఉత్తరప్రదేశ్ పోలీసులు, ఢిల్లీ పోలీసులు అలాగే ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ నమోదు చేసిన మొత్తం 18 ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఈ విస్తృత దర్యాప్తు చేపట్టింది. అమ్రపాలి గ్రూప్, దాని డైరెక్టర్లు మరియు ప్రమోటర్లు తాము చేపట్టే రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను కేవలం 36 నెలల్లోపే పూర్తి చేసి ఫ్లాట్లు అందజేస్తామని, అంతేకాకుండా పెట్టుబడిపై ఆకర్షణీయమైన రాబడి ఇస్తామని అమాయక ప్రజలను నమ్మించారు. అయితే ఇచ్చిన మాట ప్రకారం కాలపరిమితిలోగా ఏ ఒక్క ప్రాజెక్ట్‌ను పూర్తి చేయకపోగా, వేలాది మంది కొనుగోలుదారులు తమ కష్టార్జితాన్ని కోల్పోయి ఇళ్లూ రాక, డబ్బులూ రాక రోడ్డున పడ్డారు. ఈ కుంభకోణానికి సంబంధించి నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో ఏకంగా రూ. 5,000 కోట్లకు పైగా నిధులు దారి మళ్లినట్లు విస్మయకరమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి. గృహ కొనుగోలుదారుల నుంచి రియల్ ఎస్టేట్ నిర్మాణం కోసం సేకరించిన వేల కోట్ల రూపాయలను ఇతర వ్యాపారాలకు తరలించినట్లు ఈడీ గుర్తించింది. ఈ నిధుల మళ్లింపునకు అనేక షెల్ కంపెనీలను, గ్రూప్ సంస్థలను అడ్డుపెట్టుకున్నారు. వృత్తిపరమైన ఫీజుల ముసుగులో విపరీతంగా నిధులను బదిలీ చేసినట్లు దర్యాప్తు అధికారులు తేల్చారు. అమ్రపాలి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ శర్మ కుటుంబ సభ్యుల ప్రమేయంతో ఈ నిధులు సుర్భి అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రుణాలు మరియు ఇతర రూపాల్లో చేరినట్లు ఈడీ పేర్కొంది.దుబాయ్‌లో క్రెడిట్ కార్డుతో ఇల్లు బుక్ చేసుకుంటున్నారా.. అయితే ఈ ఆర్బీఐ హెచ్చరిక గురించి తప్పక తెలుసుకోండి.. ఈ అక్రమ మార్గాల ద్వారా సమకూర్చుకున్న ఈ ఆస్తులన్నింటినీ చట్టవిరుద్ధంగా సంపాదించిన 'నేర ఆదాయం' గా గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ప్రస్తుత జప్తు ప్రక్రియను పూర్తి చేసింది. దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో కలకలం సృష్టించిన ఈ భారీ మోసానికి సంబంధించి తదుపరి చట్టపరమైన చర్యలను వేగవంతం చేసిన ఈడీ, ప్రమోటర్ల అక్రమాస్తుల గుర్తింపుపై దృష్టి సారించింది. బాధితులైన గృహ కొనుగోలుదారులకు న్యాయం చేసే దిశగా ఈ దర్యాప్తు కీలక పరిణామంగా నిలవనుంది.

దీపావళికి ముందే ఐపీఓల జాతర.. రూ.50 వేల కోట్లు టార్గెట్.. ఈ టాప్ కంపెనీలపై లుక్కేసుకోండి



దేశీయ ఈక్విటీ మార్కెట్లలో అస్థిరత కొనసాగుతున్నప్పటికీ, ప్రైమరీ మార్కెట్ మాత్రం రికార్డు స్థాయి నిధుల సమీకరణతో రికార్డులు సృష్టిస్తోంది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఏకంగా 70 మెయిన్‌బోర్డ్ ఐపీఓలు పెట్టుబడిదారుల నుండి రూ. 90,500 కోట్లకు పైగా సమీకరించగా, అదే జోరు అక్టోబర్ 2026లోనూ కొనసాగుతోంది. రాబోయే దీపావళి పండుగ నాటికి దాదాపు డజనుకు పైగా అగ్రగామి కంపెనీలు తమ ఐపీఓల ద్వారా ప్రాథమిక మార్కెట్ నుండి రూ. 50,000 కోట్ల భారీ నిధులను సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. గ్లోబల్ భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, గత కొన్ని వారాలుగా కొత్తగా లిస్ట్ అయిన కంపెనీలు ఇన్వెస్టర్లకు అద్భుతమైన రాబడులను అందించడమే ఈ ఉత్సాహానికి ప్రధాన కారణం. ఈ భారీ ఐపీఓల పండుగలో టెలికామ్ రంగానికి చెందిన 'జియో ప్లాట్‌ఫామ్స్' ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ మెగా ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 31,000 నుండి రూ. 32,000 కోట్ల నిధులను సమీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా, ఈ ఐపీఓ అక్టోబర్ 21 బుధవారం నాడు సబ్‌స్క్రిప్షన్ కోసం ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా అవదా ఎలక్ట్రో (కార్స్‌బర్గ్ ఇండియా రూ. 6,500 కోట్ల ఇష్యూతో అక్టోబర్ నాటికి మార్కెట్ లోకి రానుంది) ఈ నెల ద్వితీయార్ధంలో రూ. 7,600 కోట్ల ఐపీఓతో ముందుకు రానుంది. మూలధన మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' నుండి ఇప్పటికే తుది అనుమతులు లభించడంతో పండుగ సీజన్ ముందే ఈ ఇష్యూలు సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. వచ్చే వారం పండుగ వాతావరణాన్ని మరింత పెంచుతూ మరికొన్ని ప్రముఖ ఐపీఓలు తమ ధరల శ్రేణిని ప్రకటించనున్నాయి. వీటిలో హెచ్‌డి ఫైర్ సిస్టమ్స్ (అక్టోబర్ 13) మరియు ఫ్యూజన్ సిస్టమ్స్ (అక్టోబర్ 14) వరుసగా ప్రారంభమై ఉమ్మడిగా రూ. 1,414 కోట్లు సేకరించనున్నాయి. వీటితో పాటు సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ మరియు జెట్‌వర్క్ మ్యానుఫ్యాక్చరింగ్ బిజినెస్‌లు సంయుక్తంగా రూ. 5,500 కోట్లు, బోన్‌ఫిగ్లియోలి ట్రాన్స్‌మిషన్స్ రూ. 2,500 కోట్లు, పారస్ హెల్త్‌కేర్ రూ. 1,800 కోట్లు, టొరెంట్ గ్యాస్ రూ. 4,000 కోట్లు, గుజరాత్ విక్టరీ ఫోర్జింగ్స్ రూ. 250 కోట్లు మరియు ఎన్‌డిఆర్ ఇన్విట్ ట్రస్ట్ రూ. 750 కోట్లను దారితీయనున్నాయి. టోన్యో ఇమేజింగ్ (1.81 కోట్ల ఈక్విటీ షేర్ల , ఎస్ఎఫ్‌సి ఎన్విరాన్‌మెంటల్ మరియు బాంబే కోటెడ్ స్టీల్స్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. 980% రిటర్న్స్ ఆశ చూపి రూ.1.3 కోట్లు మోసం.. బెంగళూరు ఉద్యోగిని నిలువునా ముంచిన కేటుగాళ్లు.. అసలు స్కామ్ ఇదే ఈ అనూహ్య జోరుపై జెరోధా సీఈఓ నితిన్ కామత్ స్పందిస్తూ, ప్రస్తుతం మార్కెట్‌లో ఐపీఓలు మాత్రమే నిజమైన పండుగ వాతావరణాన్ని నింపుతున్నాయని, దాదాపు 67.2 శాతం మెయిన్‌బోర్డ్ ఐపీఓలు ఇష్యూ ధర కంటే పైనే ట్రేడ్ అవుతున్నాయని విశ్లేషించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో (ఎ1 27) 78 కంపెనీలు రూ. 94,200 కోట్లను సమీకరించడం ప్రాథమిక మార్కెట్ బలాన్ని చాటుతోంది. బలమైన కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్లు, స్థిరమైన దేశీయ డిమాండ్ మరియు మెరుగైన నగదు ప్రవాహాల మద్దతుతో రాబోయే 12 నుండి 24 నెలల్లో నాణ్యమైన స్మాల్‌క్యాప్, బీఎఫ్ఎస్ఐ, ఐటీ మరియు టెలికాలంలో విపరీతమైన పెట్టుబడి అవకాశాలు లభిస్తాయని మోనార్క్ ఏఐఎఫ్ అభిప్రాయపడింది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

అమెరికా నిర్ణయం ఐటీ కంపెనీలపై ప్రభావం చూపకపోవచ్చు.. నాస్కామ్..!



శాశ్వత కార్మిక ధృవీకరణ కార్యక్రమం కింద కొత్త దరఖాస్తులు దాఖలు చేయకుండా పలు ప్రధాన టెక్నాలజీ కంపెనీలను అమెరికా ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీనిరై నాస్కామ్ స్పందించింది. వలసలు, నైపుణ్యం గల ప్రతిభావంతుల బదిలీ అనేవి రెండు వేర్వేరు అంశాలని, వాటిని ఒకే కోణంలో చూడకూడదని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ పేర్కొంది. అమెరికా కార్మిక శాఖ తీసుకున్న ఈ నిర్ణయం ఒక నిర్దిష్ట వలస మార్గాన్ని ప్రభావితం చేసినప్పటికీ, భారతీయ టెక్నాలజీ కంపెనీలు గత కొన్నేళ్లుగా హెచ్-1బి వీసాలపై తమ ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించుకున్నాయని, స్థానిక నియామకాలను విస్తరించాయని, అమెరికాలో బలమైన దేశీయ కార్మిక శక్తిని నిర్మించుకున్నాయని నాస్కామ్ ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది.అమెరికాలో పనిచేస్తున్న భారతీయ టెక్నాలజీ కంపెనీలతో సహా కొన్ని ఐటీ కంపెనీలను, శాశ్వత కార్మిక ధృవీకరణ కార్యక్రమం కింద కొత్త దరఖాస్తులు దాఖలు చేయకుండా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా కార్మిక శాఖ ఈ రోజు ప్రకటించింది. ఈ నిర్ణయం ఒక నిర్దిష్ట వలస మార్గాన్ని ప్రభావితం చేస్తున్నప్పటికీ, వలసలు, నైపుణ్యం గల ప్రతిభావంతుల బదిలీ అనేవి రెండు వేర్వేరు అంశాలని, వాటిని ఒకే కోణంలో చూడకూడదని నాస్కామ్ చెబుతూనే ఉంది. అమెరికాలో స్వల్పకాలిక నైపుణ్యాల కొరతను తీర్చడంలో హెచ్-1బి వీసా కార్యక్రమం చారిత్రాత్మకంగా కీలక పాత్ర పోషించిందని గుర్తు చేసింది. అదరగొట్టిన టీసీఎస్ ఫలితాలు.. ఒక్కో షేరుకు రూ.12 డివిడెండ్..! భవిష్యత్తులో కూడా స్వల్పకాలిక ప్రతిభ కొరతను తీర్చడానికి దీనిని ఉపయోగించడం కొనసాగుతుందని పేర్కొంది. అయితే గత కొన్నేళ్లుగా భారతీయ టెక్నాలజీ కంపెనీలు హెచ్-1బి వీసాలపై తమ ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించుకున్నాయి. అదే సమయంలో అమెరికాలో స్థానిక నియామకాలను స్థిరంగా విస్తరిస్తూ, బలమైన దేశీయ శ్రామిక శక్తిని నిర్మించుకుంటున్నాయని విశ్లేషించింది. అమెరికాలోని చాలా ఫార్చ్యూన్ 500 కంపెనీలతో భారతీయ టెక్నాలజీ కంపెనీలు కలిసి పనిచేస్తున్నాయని, ఇది మరిన్ని స్థానిక ఉద్యోగాలను సృష్టిస్తూనే, ఆవిష్కరణలు చేయడానికి, అభివృద్ధి చెందడానికి వీలు కల్పిస్తోందని నాస్కామ్ తెలిపింది. ప్రక్రియ ద్వారా హెచ్-1బి వీసాల నుండి శాశ్వత నివాసానికి మారే ఉద్యోగుల సంఖ్య చాలా పరిమితంగా ఉందని పేర్కొంది. భారతీయ టెక్నాలజీ కంపెనీలు 80కి పైగా దేశాలలో పనిచేస్తున్నాయని, స్థానిక చట్టాలు, నియంత్రణ అవసరాలను పాటించడంలో తమ నిబద్ధతను నిలకడగా ప్రదర్శించాయని కూడా పేర్కొంది. అమెరికా కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్లింగ్ శాశ్వత కార్మిక ధృవీకరణ కార్యక్రమం నుంచి కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సిఎల్, క్యాప్‌జెమిని వంటి ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద ఐటీ అవుట్‌సోర్సింగ్ సంస్థలను అమెరికా ప్రభుత్వం సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా నిర్ణయం అక్కడున్న భారతీయులకు షాక్ అని చెప్పొచ్చు. అక్కడ ఉద్యోగం వెతుక్కుంటున్న భారతీయులకు భారతీయ కంపెనీ ఉద్యోగం దొరక్కపోవచ్చు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.మా

ఆర్‌బీఐ కీలక నిర్ణయం- నాలుగేళ్ల తర్వాత రెపో రేటు పెంపు



ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల ప్రకటన- రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ 5.50 శాతానికి చేరుకున్న రెపోరేటు- దాదాపు నాలుగేళ్ల తర్వాత రెపోరేటు పెంచిన ఆర్‌బీఐ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను సవరించింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు (0.25శాతం) పెంచింది. దీంతో రెపో రేటు 5.50శాతానికి చేరింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. 2023 ఫిబ్రవరి తర్వాత వడ్డీరేట్లను ఆర్‌బీఐ పెంచడం ఇదే తొలిసారి. ఆర్‌బీఐ తాజా వడ్డీ రేట్ల పెంపు నిర్ణయంతో గృహ, వాహన రుణాలు మరింత ప్రియం కానున్నాయి.

పటిష్ఠంగా దేశ ఆర్థిక వ్యవస్థ : ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా

దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా ఉందని, ఆర్థిక కార్యకలాపాలు స్థిరంగా, విస్తృతంగా కొనసాగుతున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఆర్ బీఐ పాలసీ వైఖరిని న్యూట్రల్ నుంచి క్యాలిబ్రేటెడ్ టైటనింగ్ వైపు మారుస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్ల తగ్గింపు ఉండే ప్రసక్తే లేదని, ముమ్ముందు వడ్డీ రేట్ల పెంపు లేదా స్థిరంగా ఉంచడం మాత్రమే ఉంటుందని తేల్చి చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగానే ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి, సరఫరా గొలుసులో అంతరాయాలు వంటివి భవిష్యత్తులో దేశీయ ఆర్థిక కార్యకలాపాలపై కొంతమేర ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేశారు."ప్రపంచంలో అనిశ్చితి పరిస్థితులు ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2026-27)లో దేశ జీడీపీ వృద్ధి రేటు 40 బేసిస్ పాయింట్లు పెరిగి 7.1 శాతానికి చేరొచ్చు. ప్రపంచంలోని భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా పెరిగిన వస్తువుల ధరలు, ప్రపంచ వాణిజ్యంలో ఘర్షణలు, కఠినతరమవుతున్న ప్రపంచ ఆర్థిక పరిస్థితులు దేశ వృద్ధి అంచనాలపై కొంత మేర ప్రతికూల ప్రభావం చూపొచ్చు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది జీడీపీ వృద్ధి 7.1 శాతంగా ఉండొచ్చు. రెండో త్రైమాసికంలో 7.2 శాతం, మూడో త్రైమాసికంలో 6.9 శాతం, నాలుగో త్రైమాసికంలో 6.8 శాతం వృద్ధి ఉంటుందని అంచనా. "సంజయ్ మల్హోత్రా, ఆర్‌బీఐ గవర్నర్

'నికర ఎగుమతుల వాటా కూడా సానుకూలంగానే ఉంది'

బలమైన పెట్టుబడుల మద్దతుతో మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. నికర ఎగుమతుల వాటా కూడా సానుకూలంగానే ఉందన్నారు. గత త్రైమాసికంతో పోలిస్తే వృద్ధి రేటు కొంత మందగించినప్పటికీ, రెండో త్రైమాసికానికి సంబంధించిన హై ఫ్రీక్వెన్సీ సూచికలు ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయని సూచిస్తున్నాయని తెలిపారు. బలహీనమైన నైరుతి రుతుపవనాలు, బలమైన ఎల్ నినో పరిస్థితులు రాబోయే రబీ సీజన్‌ను ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడ్డారు. దీంతో గ్రామీణ ఆర్థిక రంగం ప్రభావితం అయ్యే ఛాన్స్ ఉందని అంచనా వేశారు.

మళ్లీ పరుగుల వరదేనా భారత బౌలర్లకు మరో అగ్నిపరీక్ష!



భారత్, వెస్టిండీస్ మధ్య మరో హైస్కోరింగ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఇప్పటికే రెండో టీ20లో పరుగుల వరద పారగా.. ఇప్పుడు మూడో టీ20లోనూ బ్యాటర్లదే ఆధిపత్యం కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్ ఉండటంతో బౌలర్లకు మరోసారి కఠిన పరీక్ష ఎదురుకానుంది. ఆదివారం రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ జరగనుంది.రాంచీలో జరిగిన రెండో టీ20లో ఇరు జట్లు కలిపి ఏకంగా 501 పరుగులు చేశాయి. తొలుత భారీ స్కోరు చేసిన భారత్‌ను వెస్టిండీస్ దీటుగా ఎదుర్కొంది. 250 పరుగుల లక్ష్యాన్ని మరో ఓవర్ మిగిలి ఉండగానే ఛేదించి సంచలన విజయం సాధించింది. దీంతో భారత బౌలింగ్ వైఫల్యాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. కోచ్ గౌతమ్ గంభీర్ కూడా బౌలర్ల ప్రదర్శనపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇండోర్ పిచ్ కూడా బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుందని అంచనా. చిన్న బౌండరీలకు తోడు మంచు ప్రభావం కూడా మ్యాచ్‌పై కీలక పాత్ర పోషించనుంది. దీంతో బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్ తప్పకుండా బంతులు వేయాల్సి ఉంటుంది. ఫీల్డింగ్‌లోనూ చిన్న తప్పిదాలకు అవకాశం ఇవ్వకూడదు.రాంచీలో భారత పేసర్ మయాంక్ యాదవ్ పవర్‌ప్లేలో మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. అయితే షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ ఇచ్చిన సులభమైన క్యాచ్‌ను వదిలేయడం భారత్‌కు భారంగా మారింది. ఆ సమయంలో 18 బంతుల్లో 38 పరుగులతో ఉన్న రూథర్‌ఫోర్డ్.. ఆ తర్వాత 37 బంతుల్లో 84 పరుగులు చేసి చెలరేగాడు. ఏడు సిక్సర్లు, ఏడు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. కెప్టెన్ షాయ్ హోప్‌తో కలిసి 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. హోప్ కూడా అజేయ శతకంతో జట్టును గెలిపించాడు.ఈ సిరీస్‌లో హోప్ ఇప్పటికే రెండు సెంచరీలు సాధించడంతో భారత బౌలర్లకు అతడిని త్వరగా ఔట్ చేయడం కీలకం. మయాంక్‌కు అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, శివమ్ దూబే, నమన్ ధీర్ నుంచి సహకారం అవసరం.మరోవైపు భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తిరిగి ఫామ్‌లోకి రావడం జట్టుకు సానుకూలాంశం. ఇండోర్‌లో అజేయంగా 102 పరుగులు చేసిన అతడు.. రాంచీలో 18 బంతుల్లోనే 40 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ కూడా 41 బంతుల్లో 82 పరుగులతో ఫామ్ అందుకున్నాడు. దీంతో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం రావడం కష్టంగా కనిపిస్తోంది.వెస్టిండీస్ మాత్రం రూథర్‌ఫోర్డ్, హోప్ ఫామ్‌తో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది. రోస్టన్ చేజ్ కూడా రెండో టీ20లో మూడు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఈ నేపథ్యంలో మూడో టీ20లో బ్యాటర్ల జోరు కొనసాగుతుందా భారత బౌలర్లు పుంజుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది.

మ్యాచ్ వివరాలు

మ్యాచ్: భారత్--వెస్టిండీస్ మూడో టీ20 తేదీ: ఆదివారం, అక్టోబర్ 11 సమయం: రాత్రి 7 గంటలకు వేదిక: హోల్కర్ స్టేడియం, ఇండోర్ ప్రత్యక్ష ప్రసారం: స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్

కోచ్‌తో గొడవ.. జాతీయ జట్టుకు ఫుట్‌బాల్ దిగ్గజం రొనాల్డో దూరం!



పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు ఎదురుదెబ్బ తగిలింది. జాతీయ జట్టు శిబిరం నుంచి ముందుగానే వెళ్లిపోవడంతో పోర్చుగీస్ ఫుట్‌బాల్ సమాఖ్య (ఎఫ్‌పీఎఫ్) అతడిపై క్రమశిక్షణ చర్యలు ప్రారంభించింది. ఈ కేసును అత్యవసరంగా విచారించాలని నిర్ణయించింది. అయితే, రొనాల్డోకు ఎలాంటి శిక్ష విధించాలనే దానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.41 ఏళ్ల రొనాల్డో.. డెన్మార్క్‌తో నేషన్స్ లీగ్ మ్యాచ్‌కు ముందు జట్టు శిబిరాన్ని వీడాడు. జట్టులో తనకు ఎంతసేపు ఆడే అవకాశం ఇవ్వాలనే విషయంలో కోచ్ జార్జ్ జీసస్‌తో విభేదాలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.ఈ వ్యవహారంపై అక్టోబర్ 9న క్రమశిక్షణ విచారణ ప్రారంభించినట్లు ఎఫ్‌పీఎఫ్ తెలిపింది. తొలుత రొనాల్డోపై తాత్కాలిక సస్పెన్షన్ విధించగా, ఆ తర్వాత మరో చర్య తీసుకున్నట్లు వెల్లడించింది. విచారణ పూర్తయ్యే వరకు వివరాలను బయటపెట్టబోమని స్పష్టం చేసింది.తాను జట్టు శిబిరం నుంచి వెళ్లిపోవడంపై రొనాల్డో ఇప్పటికే సహచర ఆటగాళ్లకు, పోర్చుగల్ అభిమానులకు క్షమాపణలు చెప్పాడు. తన తప్పునకు తగిన శిక్ష విధించాలని ఫుట్‌బాల్ సమాఖ్యను కోరాడు. జట్టు కెప్టెన్ అయినంత మాత్రాన చర్యల నుంచి మినహాయింపు ఉండకూడదని స్పష్టం చేశాడు.నార్వేతో జరిగిన నేషన్స్ లీగ్ మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో గెలిచింది. అయితే, ఆ మ్యాచ్‌లో రొనాల్డోకు ఆడే అవకాశం రాలేదు. తనకు 30 నిమిషాలు ఆడే అవకాశం ఇస్తానని కోచ్ చెప్పి, ఆ తర్వాత మాట మార్చారని రొనాల్డో ఆరోపించాడు. అలాంటి ఒప్పందం ఏదీ లేదని కోచ్ ఖండించాడు.మరోవైపు, క్లబ్ ఫుట్‌బాల్‌లో రొనాల్డో మళ్లీ సత్తా చాటాడు. అల్ నస్ర్ తరఫున దిరియా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గోల్ చేసి, తన కెరీర్ గోల్స్ సంఖ్యను 980కి చేర్చాడు. ఈ మ్యాచ్‌లో అల్ నస్ర్ 3-0తో విజయం సాధించింది. ఇప్పుడు పోర్చుగల్ సమాఖ్య విచారణలో ఎలాంటి నిర్ణయం వస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

'మళ్లీ భారత్‌కు ఆడకపోయినా నాకేం నష్టం లేదు'.. షమీ సంచలన వ్యాఖ్యలు!



టీమిండియాలో చోటు దక్కకపోవడంపై సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ కీలక వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టుకు మళ్లీ ఆడే అవకాశం రాకపోతే అది తనకు నష్టం కాదని స్పష్టం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో తన అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టినట్లు తెలిపాడు.న్యూజిలాండ్ పర్యటనకు భారత టీ20 జట్టును ప్రకటించిన సెలెక్టర్లు.. నాలుగేళ్ల తర్వాత భువనేశ్వర్ కుమార్‌కు అవకాశం ఇచ్చారు. అయితే షమీకి మాత్రం చోటు దక్కలేదు. 2023 వన్డే ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో కీలక పాత్ర పోషించిన షమీ.. చివరిసారిగా 2025 మార్చిలో భారత్ తరఫున ఆడాడు. గాయాల నుంచి కోలుకుని దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా జాతీయ జట్టులోకి ఎంపిక కావడం లేదు.భువనేశ్వర్‌కు అవకాశం రావడంపై స్పందించిన షమీ.. అతడికి మంచి అవకాశం దక్కిందని చెప్పాడు. అయితే అతడి ఎంపికతో తనకు సంబంధం లేదన్నాడు. ఎక్కడ ఆడే అవకాశం వచ్చినా తన అత్యుత్తమ ప్రదర్శన ఇస్తానని తెలిపాడు. ప్రస్తుతం రంజీ ట్రోఫీ మ్యాచ్‌పైనే తన దృష్టి ఉందని చెప్పాడు. గత రెండుమూడేళ్లుగా బాగా ఆడుతున్నా.. బెంగాల్ తరఫున తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నా.. భారత జట్టులో చోటు దక్కడం లేదని పేర్కొన్నాడు.మరోవైపు, భారత మాజీ క్రికెటర్ వసీం జాఫర్ షమీకి మద్దతుగా నిలిచాడు. అతడిని టెస్టు, వన్డే జట్లలోకి తీసుకోవాలని సూచించాడు. ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ షమీ లాంటి నాణ్యమైన బౌలర్‌ను పక్కనపెట్టడం సరికాదన్నాడు. బుమ్రా, షమీ, సిరాజ్ తన తొలి ఎంపికలని చెప్పాడు. టెస్టు జట్టులో షమీ పునరాగమనాన్ని చాలాకాలంగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు. మరోసారి అతడికి అవకాశం దక్కకపోతే భారత జట్టులోకి తిరిగొచ్చే మార్గం మూసుకుపోవచ్చని అభిప్రాయపడ్డాడు.

రొటీన్ సినిమాలకు చెక్ పెట్టి కొత్త ప్రయోగాలు చేస్తున్న కిరణ్ అబ్బవరం!



యువ నటుడిగా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఇచ్చుకున్న కిరణ్ అబ్బవరం ఇప్పుడు జోరు పెంచారు. వైవిధ్యభరితమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, తాజాగా తన అప్‌కమింగ్ ప్రాజెక్టులకు సంబంధించి ఎన్నో ఆసక్తికరమైన వికేషాలను పంచుకున్నారు. ఒకవైపు కమర్షియల్ హంగులతో పాటు, మరోవైపు సరికొత్త జోనర్లలో నటిస్తూ తన కెరీర్‌ను పరుగులు పెట్టిస్తున్నారు. గతంలో వచ్చిన 'మీటర్' సినిమా ఫ్లాప్ కావడం తనకెంతో నేర్పించిందని, రొటీన్ కథలను ప్రేక్షకులు ఆదరించరనే సత్యాన్ని ఆ సినిమా ద్వారా గ్రహించానని కిరణ్ ఓపెన్‌గా చెప్పారు. ఇకపై ప్రతి విషయంలోనూ ఆత్మవిమర్శ చేసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రియాలిటీ' మధ్యతరగతి యువకులు పెళ్లి విషయంలో ఎదుర్కొనే ఒత్తిళ్లు, తక్కువ బడ్జెట్‌లో వివాహం చేసుకోవాలనుకునే కుర్రాడి కష్టాల ఆధారంగా ఈ సినిమా వినోదాత్మకంగా రానుంది. డిసెంబర్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కేవలం సినిమాలకే పరిమితం కాకుండా డిజిటల్ వరల్డ్‌లోకి కూడా అడుగుపెడుతున్నారు కిరణ్. 'డియర్ కామ్రేడ్' ఫేమ్ భరత్ కమ్ము దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'గువ్వల చెరువు ఘాట్' అనే వెబ్ సిరీస్‌తో ఆయన ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తున్నారు. 1980ల నాటి రాజకీయ నేపథ్యంతో ఎనిమిది ఎపిసోడ్లుగా రూపొందుతున్న ఈ సిరీస్‌లో ఆయన జర్నలిస్ట్‌గా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక భారీ చిత్రాల విషయానికొస్తే, 'కాంతార: చాప్టర్-1'కి పని చేసిన శ్రీకాంత్ పుప్పాల డైరెక్షన్‌లో 'ఇంద్రపుత్ర' సినిమా చేస్తున్నారు. ఇది పీరియాడిక్ డ్రామా కాదని, కేవలం తొలి 15 నిమిషాలు మాత్రమే మైథలాజికల్ టచ్ ఉండే నేటి తరపు కథ అని ఆయన క్లారిటీ ఇచ్చేశారు. అలాగే తనే స్వయంగా నిర్మాతగా వ్యవహరిస్తున్న 'హత్య' అనే హారర్ థ్రిల్లర్ సినిమా ప్రేక్షకులను సీట్ల అంచున కూర్చోబెట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మొత్తానికి వైవిధ్యమైన కథలతో కిరణ్ అబ్బవరం చేస్తున్న ఈ కొత్త ప్రయోగాలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

కామ్రేడ్ కల్యాణ్ మూవీ.. రెండో రోజు ఊహించని కలెక్షన్స్..!

శ్రీ విష్ణు హీరోగా వచ్చిన లేటెస్ట్ మూవీ కామ్రేడ్ కల్యాణ్. ఈ చిత్రంలో మహిమ సంబియార్ హీరోయిన్ నటించింది. ఈ సినిమాకు జానకీరామ్ దర్శకత్వంలో తెరకెక్కించారు. ప్రస్తుతం ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. మొదటి రోజు పాజిటివ్ టాక్ రాకపోయినప్పటికీ.. పసూళ్లపరంగా రాణించింది. మొదటిరోజు రూ.4.5 కోట్ల గ్రాస్ కలెక్షన్ వచ్చినట్లు వెల్లడించారు. అయితే రెండో రోజు ఈ చిత్రం పసూళ్లపరంగా దూసుకెళ్లింది. ఫస్ట్ డే కేవలం రూ.4.5 కోట్లు మాత్రమే రాబట్టిన ఈ మూవీ.. రెండో రోజు ఊహించని కలెక్షన్స్ ఎత్తించింది. తనిఖారం ఒక్కరోజే రూ.8 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. రెండో రోజుల్లో కలిపి ప్రపంచవ్యాప్తంగా రూ.12 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్.



కామ్రేడ్ కల్యాణ్ కథేంటంటే..

'కామ్రేడ్ కల్యాణ్' విషయానికొస్తే 90వ దశకంలోని ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతం. ఓ మాదిరిగా వదువుకున్న తాడికొండ కల్యాణ్ (శ్రీవిష్ణు).. ఊరిలో ఓ థియేటర్‌ని లీజుకు తీసుకుని నడిపిస్తుంటాడు. అప్పుడే అక్కడి అడవుల్లో నక్సలైట్ దళాల ఏరివేత కోసమని ప్రత్యేకంగా ఐపీఎస్ అధికారి జార్జికుట్టి (ప్రైన్ టామ్ చాకో) వస్తాడు. మాస్టారి (సాయిచంద్) దళానికీ, జార్జికుట్టీకి మధ్య యుద్ధం కొనసాగుతుండగానే, ఆ ఊరిలోకి ఒరియా అమ్మాయి సితారదేవి (మహిమా సంబియార్) తన తల్లిదండ్రులతో కలిసి వస్తుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన తల్లి సరస్వతమ్మ (రాధికా శరత్‌కుమార్)ని కాపాడిన సితారని చూసి తొలి చూపులోనే కల్యాణ్ ప్రేమలో పడతాడు. ఆమెతో కలిసి జీవితాన్ని పంచుకోవాలనుకుంటాడు. సితార కోసం చేసిన కొన్ని పనుల వల్ల థియేటర్‌ని నడిపే కల్యాణ్.. కామ్రేడ్ కల్యాణ్ అవుతాడు. పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా మారిపోతాడు. అడవిలోని అన్నలకు, కల్యాణ్‌కు సంబంధమేంటి? తన ప్రేయసి సితార కుటుంబాన్ని కష్టాల నుంచి గట్టెక్కించాడా? సితార కుటుంబం కష్టాల్లో కూరుకుపోవడానికి కారణమేమిటి? అనేది మిగతా స్టోరీ.

రవితేజ కొత్త సినిమా టైటిల్ ఖరారు.. 'తులాభారం'తో వస్తున్న మాస్ మహారాజా!



మాస్ మహారాజా రవితేజ, విభిన్న చిత్రాల దర్శకుడు వివేక్ ఆత్రేయ కలయికలో రాబోతున్న కొత్త సినిమా టైటిల్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'తులాభారం' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఒక ప్రత్యేకమైన టైటిల్ డాక్యుమెంటరీని విడుదల చేసింది. ఈ వినూత్న ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ సినిమా తెరకెక్కుతోంది. వివేక్ ఆత్రేయ తనదైన శైలిలో కథను సిద్ధం చేయగా, రాక్‌స్టార్ వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. రవితేజ మాస్క్ ఎనర్జీ, వివేక్ ఆత్రేయ సృష్టించే బలమైన పాత్రలు కలిసి ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా విడుదల చేసిన 'తులాభారం' టైటిల్ డాక్యుమెంటరీ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది. ఇందులో చిత్ర నిర్మాణం, నేపథ్యానికి సంబంధించిన కొన్ని విశేషాలను పంచుకున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన క్రియాంక మోహన్, అనత్వర రాజన్ కథానాయికలుగా నటిస్తుండగా, జేడీ చక్రవర్తి, తరుణ్ భాస్కర్ కీలక పాత్రలు పోషించనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది.

ఎన్టీఆర్ -- ప్రశాంత్ నీల్ 'డ్రాగన్' షూటింగ్‌పై క్రేజీ అప్‌డేట్.. నవంబర్ నుంచి కొత్త షెడ్యూల్ షురూ!





టాలీవుడ్ మాస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ అయిన 'డ్రాగన్' మూవీ కోసం యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించి చిత్ర యూనిట్ నుంచి ఒక ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. గాయం నుంచి కోలుకుంటున్న తారక్ త్వరలోనే మళ్లీ సెట్స్‌లోకి అడుగుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ అల్యూమినియం ఫ్యాక్టరీలో ఈ చిత్రం కోసం ఒక భారీ సెట్‌ను ఇప్పటికే నిర్మించారు. నవంబర్ మొదటి వారం నుంచి ఈ సెట్‌లో 'డ్రాగన్' కొత్త షెడ్యూల్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌తో పాటు చిత్రంలోని ఇతర ప్రధాన తారాగణంపై కొన్ని కీలకమైన, ఉత్కంఠభరితమైన సన్నివేశాలను తెరకెక్కించనున్నారు. ఇదిలా ఉంటే, ప్రశాంత్ నీల్ సినిమాలలో ఇప్పటివరకు విజువల్స్ అన్నీ ప్రధానంగా బాక్స్, బ్లాక్ అండ్ గ్రే షేడ్స్‌లో ఉండటం తెలిసిందే. అయితే, ఎన్టీఆర్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మాత్రం ఒక ప్రత్యేకత ఉండబోతోందని టాక్. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ పూర్తిగా కలర్‌ఫుల్‌గా, సరికొత్త విజువల్ వండర్‌లా సాగుతాయని ప్రచారం జరుగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, రాక్ స్టార్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. తారక్ కెరీర్‌లో మరో సరికొత్త మైలురాయిగా నిలవబోతున్న ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకూ తారాస్థాయికి చేరుకుంటున్నాయి.

విజయ్ దేవరకొండ రుద్రతాండవం.. రణబాలిలో ఈ సాంగ్ చూశారా..?

తెలుగు సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రణబాలి' ఒకటి. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సినిమా ప్రమోషన్స్‌ను మరింత జోరుగా నిర్వహిస్తున్న మేకర్స్.. తాజాగా రెండో పాట 'కోబలి'ని విడుదల చేశారు.

రణబాలి నుంచి రెండో పాట

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన 'రణబాలి' అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ముందుగా స్పాటిఫైలో విడుదలైన 'కోబలి' పాట లిరికల్ వీడియాను తాజాగా యూట్యూబ్‌లోనూ విడుదల చేశారు. 'కోబలి' పాట పవర్‌ఫుల్‌గా సాగుతూ ఆకట్టుకుంటోంది. అర్థవంతమైన సాహిత్యం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అజయ్-అతుల్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమా విడుదలకు ముందు వచ్చిన ఈ రెండో పాటతో 'రణబాలి'పై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగే అవకాశం ఉంది.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.